



ఏర్పాట్లపై చర్చిస్తున్న పోలీసు అధికారులు

నేడు ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎం రాక

- ప్రధాని నగరంలో ఉండేది 2.55 గంటలే...

విశాఖపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్య మంత్రి కె.పవన్ కల్యాణ్ బుధవారం నగరానికి వస్తున్నారు. ప్రధాని మధ్యాహ్నం 2.05 గంటలకు ఢిల్లీ నుంచి బయలుదేరి సాయంత్రం 4.20 గంటలకు ఐఎన్ఎస్ డేగాలో దిగుతారు. అక్కడ గౌరవ వందనం స్వీకరించిన అనంతరం రోడ్డు మార్గంలో తాటిచెట్లపాలెం జంక్షన్, ఫ్లైఓవర్, దత్ ఐలాండ్ మీదుగా 4.40 గంటలకు ఏయూ ఎకనామిక్స్ విభాగం ఎదురుగా ఉన్న వెంకటాద్రి వంటిల్లు వద్దకు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్‌షోలో పాల్గొంటారు. వెంకటాద్రి వంటిల్లు నుంచి త్రీటౌన్ పోలీస్ స్టేషన్ జంక్షన్ మీదుగా 5.30 గంటలకు ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్మించిన సభా వేదిక వద్దకు చేరుకుంటారు. 5.30 గంటల నుంచి 6.45 గంటల వరకు ప్రధాని వేదికపై ఉంటారు. తరువాత రోడ్డు మార్గాన బయలుదేరి రాత్రి 7.10 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుని, 7.15 గంటలకు ప్రత్యేక విమానంలో భువనేశ్వర్ వెళతారు.

బెంగళూరు నుంచి చంద్రబాబు..

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం మధ్యాహ్నం బెంగళూరు నుంచి 12.55 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. రోడ్డు మార్గాన 1.35 గంటలకు పోర్టు గెస్ట్ హౌస్‌కు వెళతారు. మధ్యాహ్నం 3.45 గంటలకు గెస్ట్ హౌస్ నుంచి బయలుదేరి సాయంత్రం నాలుగు గంటలకు ఐఎన్ఎస్ డేగాకు చేరుకుంటారు. 4.15 గంటలకు ప్రధాని నరేంద్రమోదీకి స్వాగతం పలికి ఆయనతో పాటు రోడ్డుమార్గాన వెంకటాద్రి వంటిల్లు వద్దకు చేరుకుని రోడ్ షో, అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారు. సభ ముగిసిన తరువాత తిరిగి ఎయిర్‌పోర్టుకు

... మిగతా 6వ పేజీలో



సభా వేదిక వద్ద ఏర్పాట్లు

ప్రధాని పర్యటనకు సర్వం సిద్ధం

నేడే ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నరేంద్రమోదీ బహిరంగ సభ

- దత్ ఐలాండ్ సమీపంలో గల వంటిల్లు ప్రాంతం నుంచి వేదిక వరకూ రోడ్ షో
- పాల్గొననున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్
- మైదానంలో రెండు వేదికలు
- ఒకటి అతిథుల కోసం, మరొకటి సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన కోసం
- ప్రధాన వేదికకు ఎదురుగా 33 గ్యాలరీలు
- గ్యాలరీల్లో ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు
- రెండో మైదానంలో 15 వేల మంది కూర్చునేందుకు అనువుగా టెంట్లు

విశాఖపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): **ప్రధాని నరేంద్రమోదీ పర్యటనకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో బుధవారం సాయంత్రం నిర్వహించనున్న బహిరంగ సభలో ప్రధానితో పాటు గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు పాల్గొననున్నారు.**

కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారిగా ప్రధాని రాష్ట్రానికి వస్తుండడంతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. బహిరంగ సభ, రోడ్‌షోలను విజయవంతం చేసేందుకు వారం రోజులుగా సన్నాహాలు చేస్తోంది. మూడు లక్షల మందిని సమీకరించాలని ప్రణాళిక రూపొందించింది. సభకు రెండు లక్షలు, రోడ్‌షోకు లక్ష మంది వచ్చేలా ఏర్పాట్లు చేస్తోంది. ఉత్తరాంధ్రలో నాలుగు జిల్లాల నుంచి

... మిగతా 6వ పేజీలో



రోడ్ షో ప్రారంభం కానున్న ప్రాంతంలో మంగళవారం సాయంత్రం పీఎం కాన్వాయ్ ట్రయల్ రన్

నగరం పోలీస్ మయం

- ఏయూ పరిసర ప్రాంతాల్లో భారీగా మోహరింపు
- రోడ్డు షో మార్గాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్న ఎన్ఎస్‌జీ
- త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి దత్ ఐలాండ్ రోడ్డు మూసివేత
- ఎయిర్‌పోర్టు నుంచి ఎక్కడికక్కడ పోలీస్ బీట్‌లు

విశాఖపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాని పర్యటన నేపథ్యంలో నగరం మొత్తం పోలీస్‌మయంగా మారింది. ముఖ్యంగా బహిరంగ సభ జరిగే ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానం పరిసర ప్రాంతాలతోపాటు రోడ్‌షో మార్గంలో పోలీసులను భారీగా మోహరించారు. చత్తీస్‌గఢ్‌లో జవాన్లపై మావోయిస్టుల దాడి నేపథ్యంలో భద్రతను మరింత పటిష్ఠం చేసినట్టు పోలీస్ అధికారులు చెబుతున్నారు. ప్రధాని రోడ్‌షో జరిగే దత్ ఐలాండ్ నుంచి త్రీటౌన్ జంక్షన్ వరకూ రోడ్డును మంగళవారం సాయంత్రం పోలీసులు పూర్తిగా మూసేశారు. ఎన్ఎస్‌జీ కమాండోలు ఆ రోడ్డును పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ

... మిగతా 6వ పేజీలో

ఐదు వేల మందితో బందోబస్తు

విశాఖపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ నగర పర్యటన సందర్భంగా ఐదు వేల మందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేసినట్టు పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 35 మంది ఐపీఎస్‌లు, 18 మంది అదనపు ఎస్పీలు, 60 మంది డీఎస్పీలు, 180 మంది సీఐలు, 400 మంది ఎస్ఐల నేతృత్వంలో వేలాది మంది పోలీసులతో ప్రధాని ప్రయాణించే మార్గాల్లో బందోబస్తు ఏర్పాటుచేశామన్నారు. ప్రధానికి స్వాగతం పలికే ఐఎన్ఎస్ డేగా వద్ద స్పాట్ బందోబస్తు, వీవీఐపీలు ప్రయాణించే మార్గాల్లో రూట్ బందోబస్తు, రోడ్‌షో జరిగే ప్రాంతాల్లో బాక్స్ బందోబస్తు, సభ జరిగే ప్రాంతంలో ఇన్‌సైడ్, అవుట్‌సైడ్ బందోబస్తుతోపాటు వేదిక వద్ద ప్రత్యేక కేటగిరీ భద్రత ఏర్పాటుచేశామన్నారు. 30 చోట్ల ఏర్పాటుచేసిన పార్కింగ్ ప్రాంతాల్లో కూడా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సభ పరిసర ప్రాంతాలతోపాటు నగర ప్రవేశప్రాంతాల వద్ద పికెట్‌లు ఏర్పాటుచేశామన్నారు. ప్రధాని సభ నేపథ్యంలో బుధవారం రాత్రి పది గంటల వరకు లారీలను నగరంలో తిప్పకుండా నిలిపివేయాలని కోరుతూ ఆయా అసోసియేషన్లకు లేఖలు రాశామన్నారు.



పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి

నేటి నుంచి ఏపీ డిజిటల్ టెక్నాలజీ సదస్సు

- ముఖ్య అతిథిగా హాజరుకానున్న మంత్రి నారా లోకేశ్



విశాఖపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ టెక్నాలజీపై రాష్ట్ర స్థాయి సదస్సు బుధవారం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో జరగనుంది. రెండు రోజులు నిర్వహించే ఈ సదస్సుకు రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖల మంత్రి

... మిగతా 6వ పేజీలో

ఫటా..ఫట్

ప్యాకేజీలు కాదు, ఆర్థిక సాయం చేయాలి

- విశాఖ ఉక్కు గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ



స్టీల్‌ప్లాంటును ప్రైవేటీకరించాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్టు ప్రధాని నరేంద్రమోదీ తన పర్యటనలో ప్రకటించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్లాంటుపై కేంద్రం నుంచి ఏమి కోరుకుంటున్నారో విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్, గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

ప్ర: ప్యాకేజీ ఇస్తామంటున్నారు కదా?
జ: ఇప్పుడు ప్యాకేజీలు ప్రధానం కాదు. ఆర్థిక సాయం కావాలి.

ప్ర: ఎటువంటి ఆర్థిక సాయం కావాలి?
జ: గతంలో వాజపేయి హయాంలో చేసినట్టే క్యాపిటల్ రీస్ట్రక్చర్ చేయాలి. దీనివల్ల వడ్డీల బాధ తప్పుతుంది. నెలకు రూ.250 కోట్లు వడ్డీలకు చెల్లిస్తున్నాం.

ప్ర: సెయిల్‌లో విలీనం చర్చల్లో ఉందా?
జ: అదే మా ప్రధాన డిమాండ్. ఇదే అంశంపై కూటమి పార్టీలన్నీ తీర్మానం కూడా చేశాయి. ఇప్పుడు దాని గురించి ఎవరూ మాట్లాడడం లేదు.

ప్ర: సొంత గనులు?
జ: విశాఖ స్టీల్‌ప్లాంటు పెట్టినప్పటి నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అడుగుతున్నాం. కొత్తగా నక్కపల్లిలో ఏర్పాటయ్యే ఆర్సెలర్ మిట్టల్ ప్లాంటుకు సొంత గనుల కోసం ప్రభుత్వ పెద్దలు యోచిస్తున్నారు గానీ విశాఖస్టీల్‌ను గుర్తించడం లేదు.

- విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి



నో బెర్త్

పండగ అనంతరం రైళ్లకు తిరుగు ప్రయాణికుల తాకిడి

- సికింద్రాబాద్ రైళ్లకు మరింత ఎక్కువగా డిమాండ్
- 22వ తేదీ వరకూ 'రిజర్వు'
- బెంగళూరు, హౌరా రైళ్లలో నెలాఖరు వరకూ బెర్తులు ఫుల్
- చెన్నై రైళ్లలోనూ అదే పరిస్థితి

విశాఖపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి స్వస్థలాలకు వచ్చి...పండుగ అనంతరం తిరిగి నివాసిత ప్రాంతాలకు బయలుదేరే వారికి రైళ్లలో బెర్తులు దొరికే పరిస్థితి కనిపించడం లేదు. ముఖ్యంగా సికింద్రాబాద్ వెళ్లే రైళ్లకు తీవ్ర డిమాండ్ కనిపిస్తోంది. విద్య, ఉద్యోగ, వ్యాపారాల నిమిత్తం హైదరాబాద్ తిరిగి వెళ్లాల్సినవారు ప్రత్యామ్నాయ రవాణా సాధనాలపై ఆధారపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నెల 22 వరకూ రైళ్లలో బెర్తులు రిజర్వు అయిపోయాయి. చెన్నై, హౌరా, భువనేశ్వర్ ప్రాంతాలకు వెళ్లే రైళ్లకు కూడా దాదాపు నెలాఖరు వరకు ఖరారు బెర్తులు లభించే పరిస్థితి లేదు. నిరీక్షణ జాబితా చాంతాడంత ఉంది.

సికింద్రాబాద్ వెళ్లే రైళ్లు ఫుల్

విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే గోదావరి (12727), విశాఖ (17015), దురంతో (22203), గరీబ్‌రథ్ (12739), విశాఖ-నాందేడ్ (20811), ఎల్‌టీటీ (18519), ఫలక్‌నుమా (12703), కోణార్క్ (11020), విశాఖ-కాచీగూడ (12861), జన్మభూమి (12805), వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లలో ఈ నెల 22 వరకు బెర్తులు రిజర్వ్ అయిపోయాయి. కోణార్క్, ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైళ్లకు నెలాఖరు వరకు ఖరారు బెర్తు లభించే పరిస్థితి లేదు. గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 26వ తేదీ వరకు స్లీపర్ క్లాసు బెర్తులు ఫుల్ అయిపోయాయి.

వందేభారత్‌కు డిమాండ్

విశాఖ, సికింద్రాబాద్ మధ్య నడుస్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (20833, 20708) ప్రయాణికుల నుంచి విశేష స్పందన వస్తోంది. టికెట్ ధరను లెక్కచేయకుండా గమ్యానికి చేరుకోవడానికి ముందస్తు రిజర్వేషన్ పొందుతున్న నేపథ్యంలో అనూహ్య స్థాయిలో డిమాండ్ ఏర్పడింది. అయితే కనుమ పండుగ (బుధవారం) రోజు ఉదయం 5.45 గంటలకు బయలుదేరే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20833)లో సీట్లు అందుబాటులో ఉండగా, తర్వాత రోజుల్లో చైర్‌కార్, ఎగ్జిక్యూటివ్ చైర్‌కార్ సీట్లు ఫుల్ అయిపోయాయి. మధ్యాహ్నం 2.30 గంటలకు బయలుదేరే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20708)లో కూడా 15 నుంచి డిమాండ్ ఉంది. సీట్లు నిండిపోయాయి.

హౌరా, చెన్నై, బెంగళూరు రైళ్లకు తీవ్ర డిమాండ్

విశాఖ నుంచి కోల్‌కతా, ఖరగ్‌పూర్, భువనేశ్వర్, చెన్నై, ఎర్నాకులం, బెంగళూరు ప్రాంతాలకు వెళ్లే రైళ్లకు సంక్రాంతి తిరుగు ప్రయాణాల తాకిడి ఎక్కువగానే ఉంది. హౌరా వెళ్లే కోరమండల్ ఎక్స్‌ప్రెస్ (12842), మెయిల్ (12840), ఈస్ట్ కోస్ట్

... మిగతా 6వ పేజీలో

సంక్రాంతికి ఆర్టీసీ స్పెషల్స్

- 200 బస్సులను సిద్ధం చేసిన అధికారులు
- రేపటి నుంచి ప్రారంభం



ద్వారకా బస్‌స్టేషన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ విశాఖ రీజియన్ అధికారులు అదనంగా 200 బస్సులను సిద్ధం చేశారు. హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, భీమవరం, గుంటూరు, ఖమ్మం వంటి దూర ప్రాంతాలకు నడిపేందుకు గరుడ, గరుడ ప్లస్, అమరావతి, నైట్ రైడర్, క్రూయిజ్, ఆల్ట్రా డీలక్స్‌లను, జోనల్ పరిధిలోని రాజమండ్రి, కాకినాడ, అమలాపురం, విజయనగరం, బొబ్బిలి, సాలూరు, రాజాం, శ్రీకాకుళం, పలాస, ఇచ్ఛాపురం, టెక్కలి, మందస, పాతపట్నం వంటి ప్రాంతాలకు నడిపేందుకు ఆల్ట్రా డీలక్స్, డీలక్స్, సూపర్ లగ్జరీ, మెట్రో లగ్జరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లను ఎంపిక చేశారు. ఈ రెండు వందల బస్సులను గ్యారేజీల్లో పూర్తిస్థాయిలో పరీక్షించారు. బుధవారం నుంచి సంక్రాంతి స్పెషల్స్ నడపాలని అధికారులు భావించారు. కానీ ప్రధాని సభకు బస్సులు కేటాయించాల్సి రావడంతో తొమ్మిదో తేదీ నుంచి స్పెషల్స్ నడిపేందుకు నిర్ణయించారు. ద్వారకా బస్‌స్టేషన్‌తో పాటు ప్రయాణికుల డిమాండ్ మేరకు మద్దిలపాలెం, గాజువాక, స్టీల్‌సిటీ, సింహాచలం డిపోల నుంచి నేరుగా వివిధ ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులు నడుపుతామని రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యనారాయణ వెల్లడించారు. డిమాండ్‌ను బట్టి రాత్రి కూడా బస్సులు నడిపే ఆలోచన ఉందన్నారు. సంక్రాంతి ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా అవసరమైనన్ని బస్సులు ఏర్పాటుచేస్తామని ఆయన పేర్కొన్నారు.

ప్రధాని సభకు 500 ఆర్టీసీ బస్సులు

విశాఖపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ సభకు విశాఖ జిల్లా పరిధిలోని వివిధ నియోజకవర్గాల నుంచి జనాలను తరలించేందుకు 500 బస్సులను కేటాయించినట్టు విశాఖ ఆర్టీసీ రీజియన్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. దాంతో పాటు నగర పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు కూడా ఉన్నందున సిటీ సర్వీసులు తగ్గుతాయని, ప్రయాణికులు ఈ విషయాన్ని గుర్తించాలని ఆయన కోరారు.

8 మెడికల్ క్యాంపులు

బహిరంగ సభ ప్రాంగణంలో ఆరోగ్య శాఖ ఎనిమిది మెడికల్ క్యాంపులను ఏర్పాటుచేస్తోంది. ఒక్కో క్యాంపులో వైద్యుడు, ఫార్మసిస్ట్, స్టాఫ్ నర్సుతోపాటు ఏఎన్ఎంలు సేవలు అందిస్తారు. అలాగే ఏడు అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచనున్నారు.

వీఎంఆర్‌డీఏ సెక్రటరీగా మురళీకృష్ణ

- ఎస్టేట్ ఆఫీసర్‌గా దయానిధి

విశాఖపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ)లో కొద్దికాలంగా ఖాళీగా ఉన్న

... మిగతా 6వ పేజీలో

నైపుణ్య గణనకు సన్నాహాలు

- నెలాఖరులో ప్రారంభం
- ప్రభుత్వం నుంచి అధికారులకు అందిన సమాచారం
- ఇప్పటికే శిక్షణ పూర్తిచేసుకున్న సిబ్బంది
- నైపుణ్యం ప్రాతిపదికగా యువతకు ఉద్యోగ కల్పన
- ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చర్యలు
- నోడల్ అధికారిగా వ్యవహరించనున్న జాయింట్ కలెక్టర్

విశాఖపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): **ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుకు కూటమి ప్రభుత్వం ఒక్కో అడుగు వేస్తోంది. ఇందులో భాగంగా యువతలోని నైపుణ్యాన్ని గుర్తించి, ఉద్యోగావకాశాలు కల్పించడంతో పాటు, అవసరమైన వారికి నైపుణ్య శిక్షణ అందించే దిశగా ప్రయత్నాలు ప్రారంభిస్తోంది. ఈ నెలాఖరు నుంచి నైపుణ్య గణనకు ఏర్పాట్లు చేస్తోంది.**



విద్యార్హతలున్నప్పటికీ, తగిన నైపుణ్యం లేకపోవడంతో ఉపాధి లభించడం లేదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గుర్తించారు. ఈ మేరకు వారికి నైపుణ్య శిక్షణ అందించేందుకు 2014లోనే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్స్ ఏర్పాటుచేశారు. వాటి ద్వారా ఎంతోమంది తమ స్కిల్స్ మెరుగుపరచుకున్నారు. అయితే తాజాగా నైపుణ్య గణనకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి సంస్థకు ఆ బాధ్యతను అప్పగించింది. వీరికి వివిధ శాఖల అధికారులు సహకరిస్తారు. జిల్లాస్థాయిలో నైపుణ్య గణనను పర్యవేక్షించే బాధ్యతను జాయింట్ కలెక్టర్‌కు అప్పగిస్తూ నోడల్ అధికారిగా నియమించింది. ఈ నెలాఖరు నుంచి సెన్సస్ ప్రారంభించే అవకాశం ఉండడంతో జిల్లా అధికారులు ఏర్పాట్లు చేసుకోవాలని సమాచారం అందినట్టు చెబుతున్నారు. నైపుణ్య గణన చేపట్టేందుకు వీలుగా జిల్లాలోని 4,500 మంది సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి నైపుణ్య గణన చేపడతారు.

గణన చేపట్టేది ఇలా...

నైపుణ్య గణనను అత్యంత పకడ్బందీగా చేపట్టాలన్నది ప్రభుత్వ ధ్యేయం. ఇందులో భాగంగా సిబ్బంది కచ్చితంగా ప్రతి ఇంటికీ వెళ్లి అన్ని వివరాలు సేకరించాలని ఆదేశాలు జారీచేసింది. కార్యాలయాల్లో కూర్చుని వివరాలు అప్‌లోడ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించింది. కాగా రెండు విధాలుగా నైపుణ్య గణన

... మిగతా 6వ పేజీలో

నేడు మండల సమావేశం

పద్మనాభం రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ కె.రాంబాబు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎం.విజయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

అవంతి ఫార్మశీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు



వేడుకలు ప్రారంభిస్తున్న కళాశాల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి

తగరపువలస, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస సమీపంలో అవంతి ఫార్మాకళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన టాలెంట్ షో, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎంబీ వెంకటపతిరాజు, ఏయూ ఫార్మా కళాశాల ప్రొఫెసర్ వి.గిరిజాశాస్త్రి, కెజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డా.రాధాకృష్ణన్ దేశరాజు, విజయనగరం సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వీసీ ప్రొ. తేజస్వి వెంకప్పా కట్టిమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ సభను జయప్రదం చేయాలి

భీమునిపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ విశాఖ పర్యటనను విజయవంతం చేయాలని, ఇందులో భీమిలి నియోజకవర్గ కూటమి శ్రేణులందరూ భాగస్వాములు కావాలని నియోజకవర్గ పరిశీలకులు, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు కోరారు. స్థానిక బీచ్‌రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో తెలుగుదేశం, బీజేపీ, జనసేన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి కనీసం 30 వేల మంది వరకూ జనసమీకరణ చేయడానికి కూటమి ప్రతీ కార్యకర్త శ్రమించాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గ బీజేపీ కన్వీనరు కె.రామానాయుడు, జనసేన ఇన్‌చార్జి పంచకర్ల సందీప్, భీమిలి మండల టీడీపీ అధ్యక్షుడు అప్పల నరసింహరాజు పాల్గొన్నారు.

నో బెర్త్

... 5వ పేజీ తరువాయి

(18046), ఫలక్‌నుమా (12704) వంటి రెగ్యులర్ రైళ్లలో దాదాపు ఈ నెలాఖరు వరకూ బెర్తులు అయిపోయి, నిరీక్షణ జాబితా ఉంది. అలాగే చెన్నై వెళ్లే కోరమండల్ ఎక్స్‌ప్రెస్ (12841), మెయిల్ (12839), బొకారో ఎక్స్‌ప్రెస్ (13351) వంటి రెగ్యులర్ రైళ్లతోపాటు బై వీక్లీ, వారాంతపు రైళ్లకు ఈ నెల 26 వరకు బెర్తులు లభించే పరిస్థితి లేదు. ఇక బెంగళూరు చుటుపక్కల ప్రాంతాలకు వెళ్లే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18463), హౌరా-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12863) వంటి డైలీ రైళ్లతోపాటు బై వీక్లీ, వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు తీవ్ర డిమాండ్ ఏర్పడి నెలాఖరు వరకు బెర్తులు నిండిపోయి నిరీక్షణ జాబితా కనిపిస్తోంది.

కేజీబీవీని సందర్శించిన సోషల్ ఆడిట్ బృందం



విద్యాలయంలో బృందం సభ్యులు

భీమునిపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): భీమిలి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం సోషల్ ఆడిట్ బృందం ఆకస్మికంగా సందర్శించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ గంగాకుమారి తెలిపారు. బృందంరాష్ట్ర రిసోర్స్ పర్సన్ నాగరాజు, డీఆర్‌పాలు పోలినాయుడు, శివప్రసాద్‌లు తనిఖీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాలయంలోని రికార్డులను, స్టోర్ రూమ్, లైబ్రరీ, సైన్స్ ల్యాబ్‌లను వారు పరిశీలించారు. అలాగే ఎస్ఎంసీ సభ్యులు, విద్యార్థినులతో మాట్లాడారు. ఆహార పదార్థాలను పరిశీలించారు.

అంధులకు నిత్యావసర సరకులు పంపిణీ

భీమునిపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కీటిన్‌పేట సెయింట్ పీటర్స్ చర్చిలో అంధులకు నిత్యావసర సరకులను చర్చి నిర్వాహకులు లక్ష్మణ్, సురేశ్ ఆధ్వర్యంలో బుధవారం కె.సురేశ్‌బాబు పంపిణీ చేశారు. అదేవిధంగా 50 మందికి చీరలు అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్ చైతన్యకుమార్, సుధాకర్, విజయ్, థామస్, మేరి, శామ్యూల్, తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌జీవో కాలనీ పేరిట సుద్దపేట సమీపంలో ఏర్పాటు చేసిన పార్కు



పార్కులో నిరుపయోగంగా ఉన్న క్రీడా సామగ్రి, జిమ్ పరికరాలు

కాలనీ ఒకచోట.. పార్కు మరోచోట!

- నిరుపయోగంగా ఉందంటున్న ఎన్‌జీవో కాలనీవాసులు
- రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్న ఆరోపణలు

మధురవాడ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ఏడో వార్డు పరిధి సుద్దగెడ్డ సమీపంలో జీవీఎంసీ ఏర్పాటు చేసిన పార్కు నిరుపయోగంగా ఉంది. జోన్-2 పరిధిలోని ఎన్‌జీవో కాలనీలో ఏర్పాటు చేయవలసిన పార్కును వాంబే కాలనీకి వెళ్లే రహదారి పక్కన సుద్దగెడ్డ సమీపంలో ఎవరికీ ఉపయోగం లేకుండా ఎందుకు ఏర్పాటు చేశారో అర్థం కావడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఎన్‌జీవో కాలనీలో పార్కు ఏర్పాటుకు స్థలాలున్నా సుద్దగెడ్డ వద్ద ఎందుకు ఏర్పాటు చేశారని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. ఎన్‌జీవో కాలనీ పిల్లలు ఈ పార్కుకు రావాలంటే మిథిలాపురి వుడా కాలనీ నుంచి వాంబే కాలనీకి వెళ్లే వందడుగుల రోడ్డును దాటుకుని వెళ్లాలి. ఇది ప్రమాదకరమని భావిస్తున్న ఎన్‌జీవో కాలనీకి చెందిన తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ పార్కుకు పంపడం లేదు.

దీంతో ఈ పార్కు ఎప్పుడూ బోసిపోయి కనిపిస్తుంది. సుద్దగెడ్డ వారన సమీపంలో పార్కు ఉండడం వల్ల దుర్వాసన వస్తుందని, అందువల్ల ఇక్కడకు వెళ్లేందుకు పెద్దలు సైతం ఆసక్తి చూపడం లేదు. ఈ పార్కులో జీవీఎంసీ ఓపెన్ ఎయిర్ జిమ్ పరికరాలను ఏర్పాటు చేసినా వ్యాయామం కోసం వెళ్లేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. నిరుపయోగం ఉన్న ఈ పార్కును రాత్రి వేళల్లో అసంఘటిక కార్యకలాపాలకు పలువురు వినియోగించుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

నూతన విద్యావిధానంపై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఎన్వీ రమణ, మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి, ప్రొఫెసర్లు, విద్యార్థులు

తగరపువలస, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం జాతీయ నూతన విద్యావిధానం (ఎన్ఇఆర్ఎఫ్)పై మేధావులతో అవగాహన సదస్సు నిర్వహించారు. గౌరవ అతిథిగా హాజరైన రాయపూర్ ఎన్ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్వీ రమణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2020, జూలై 29న ఈ నూతన విద్యా విధానాన్ని ఆమోదించిందన్నారు. విద్యార్థులను విద్యా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడం ద్వారా వారిలో నైపుణ్యాభివృద్ధి పెంపొందించేందుకు ఈ విధానంలో ప్రాధాన్యం ఉందన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ నూతన విద్యా విధానం సృజనాత్మకతకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. బి.మురళీకృష్ణ, డైరెక్టర్ డా.ఎ.చంద్రశేఖర్ వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బకాయిలు ఇప్పించండి

- కార్మిక శాఖకు చిట్టివలస జూట్‌మిల్లు కార్మికుల వినతి



తగరపువలస, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్‌మిల్లు కార్మికులకు యాజమాన్యం చెల్లించాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించేలాచర్యలు తీసుకోవాలని కోరుతూ జూట్‌మిల్లు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు మంగళవారం విశాఖపట్నంలో కార్మిక శాఖ సహాయకమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జూట్‌మిల్లులో ఎంతోకలం అప్రెంటిష్‌గా పని కార్మికులకు వేతన బకాయిలు ఇవ్వా లని, మిల్లులో పని చేసిన కార్మికులందరికీ గ్రాట్యుటీ, ఇతర నష్ట పరిహారాలను చెల్లించడంతో పాటు మిగతా సమస్యలను పరిష్కరించాలని కోరారు.కాంగ్రెస్ కార్మిక సంఘానికి చెందిన దల్లి అప్పలరెడ్డి, ఎం.ఆదినారాయణ, ఏఐటీయూసీకి నేతలు కె.ఈశ్వరరావు, కె.రాంబాబు, చిల్ల రాంపైడి, టీఎన్టీయూసీ నేతలు ఎం.దేముళ్లు, ఎన్.రామారావు వినతిపత్రంపై సంతకాలు చేశారు.

సైబర్ సెక్యూరిటీ, మెషిన్ లెర్నింగ్‌పై నైపుణ్యం అవసరం

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ గౌతమ్‌రావు



ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ గౌతమ్‌రావు

సాగర్‌నగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఐటీ, పారిశ్రామిక రంగాలలో మెషిన్‌లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ అంశాలకు పెరుగుతున్న ప్రాధాన్యం దృష్ట్యా విశ్వవిద్యాలయాల్లోని అధ్యాపకులు వీటిపై నైపుణ్యం పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్‌చాన్స్‌లర్ వై.గౌతమ్‌రావు పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఈఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 'మెషిన్‌లెర్నింగ్ ఆధారిత సిగ్నల్ ప్రాసెసింగ్, సైబర్ సెక్యూరిటీ అల్గారిథమ్స్' అంశంపై అధ్యాపకులకు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధ్యాపకులు నిరంతర అధ్యయనం ద్వారా ఈ అంశాలపై లోతైన పరిజ్ఞానం కలిగి వుండాలన్నారు. ప్రధాన వక్తగా విచ్చేసిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (బెంగళూరు) శాస్త్రవేత్త డాక్టర్ కె.సోలమన్‌రాజు మాట్లాడుతూ బిగ్ డేటా రంగం ప్రయోజనాలను వివరించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో సమాచార సేకరణ ఎంత ముఖ్యమో సమాచార భద్రత అంతే కీలకమన్నారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజి డైరక్టర్ కె.నాగేంద్రప్రసాద్, స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ వి.రామశాస్త్రి, ఈఈసీఈ విభాగం అధిపతి ప్రొఫెసర్ పి.భరణిచంద్రకుమార్, ఎఫ్‌డీపీ కన్వీనర్‌లు డాక్టర్ జి.అనిత, డాక్టర్ కె.రేణు, డాక్టర్ ఐ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రంగోలి పోటీలో కేజీబీవీ బాలికల ప్రతిభ

పద్మనాభం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : భీమిలి డైట్‌లో మంగళవారం నిర్వహించిన వివిధ పోటీలలో పద్మనాభం కేజీబీవీ విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించారు. 9వ తరగతి చదువుతున్న కె. కుసుమాదేవి డ్రాయింగ్ పోటీలో, కె.సుప్రియ స్లోగన్ పోటీలో ప్రథమ బహుమతి పొందారు. 6వ తరగతి బాలిక బి.దిరూప, 7వ తరగతి బాలిక బి.భవానీ నాటిక పోటీలో ద్వితీయ బహుమతిని పొందారు. వీరిని కళాశాల సిబ్బంది అభినందించారు.

అద్దె భవనాల్లో వార్డు సచివాలయాలు

మధురవాడ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటు చేసి సుమారు ఆరేళ్లు కావస్తున్నా.. ఇప్పటికీ కొన్నింటికి సొంత భవనాలు లేవు. జోన్-2 పరిధిలోని 5 నుంచి 13 వార్డుల్లో మొత్తం 91 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో 24 సచివాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.వీటికి స్థానికంగా ఉన్న డిమాండ్ మేరకు ప్రతి నెల రూ. 5 వేలు నుంచి రూ.25 వేలు వరకు ప్రభుత్వం అద్దె చెల్లిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం అవసరానికి మించి సచివాలయాలను ఏర్పాటు చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడిందన్న విమర్శలు ఉన్నాయి. సచివాలయాల వ్యవస్థ ప్రారంభించినప్పుడు అప్పటికప్పుడు సొంత భవనాలు ఏర్పాటు చేయడం సాధ్యం కాకపోవడంతో కొన్ని తుఫాన్ షెల్టర్లలో, మరికొన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఆవరణల్లో ఏర్పాటు చేశారు. జోన్-2 పరిధిలో 24 సచివాలయాలకు వసతి సమకూరకపోవడంతో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. వీటికి అద్దె రూపంలో నెలకు సుమారు రూ. 4 లక్షలకు పైగా ఖర్చు అవుతోంది. కొన్నిచోట్ల ఒకే భవనంలో రెండు సచివాలయాలు నిర్వహిస్తున్నారు. 7వ వార్డులోని వాంబేకాలనీ రహదారిలో మూడంతస్తుల భవనంలో రెండు, మూడు అంతస్తుల్లో 55, 56 నంబరు సచివాలయాలను నిర్వహిస్తున్నారు. వార్డుల వారీగా పరిశీలిస్తే 5వ వార్డులో 4, 6వ వార్డులో 3, 7వ వార్డులో 4, 8వ వార్డులో 2, 9వ వార్డులో 2, 10వ వార్డులో 3, 11 వార్డులో 4, 13 వార్డులో 2 సచివాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.





విజేతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతికుమారి, తదితరులు

ఉత్సాహంగా రంగోత్సవ పోటీలు

భీమునిపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ డైట్‌లో బుధవారం ఎంతో ఉత్సాహభరితంగా జిల్లా స్థాయి రంగోత్సవ పోటీలు జరిగాయి. పది పాఠశాలలకు చెందిన సుమారు 150 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డైట్ ప్రిన్సిపాల్ ఎం.జ్యోతికుమారి మాట్లాడుతూ విద్యార్థుల్లో జాతీయ సమైక్యత, సృజనాత్మకత, భాషాభివృద్ధి అంశాలలో నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ పోటీలను నిర్వహించామన్నారు. క్విజ్ పోటీలో నడుపూరు జడ్పీ ఉన్నత పాఠశాల బృందం, డ్రాయింగ్ పోటీల్లో పద్మనాభం కేజీబీవీ విద్యార్థిని, డిజిటల్ కాలేజీ పోటీల్లో నడుపూరు జడ్పీ హైస్కూల్, దస్తూరి పోటీలో భీమిలి కేజీబీవీ విద్యార్థిని, స్లోగన్స్ రాయడంలో పద్మనాభం కేజీబీవీ విద్యార్థిని, జానపద నృత్య పోటీల్లో ఆరిపాక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, రోల్ ప్లే పోటీలో ఆరిపాక జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానాల్లో నిలిచారన్నారు. వీరందరూ ఈ నెల 24న విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి రంగోత్సవ్ పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా డైట్ సీనియర్ అధ్యాపకులు ఎల్.సుధాకర్, జీజీఎస్ నాగేశ్వరావు, అధ్యాపకులు ఎస్.త్రినాథరావు, జె.మాధవి, ఎం.మహాలక్ష్మి, ఎ.సోమయాజులు, ఎన్.నీలిమ వ్యవహరించారు. .

నేటి రెవెన్యూ సదస్సు వాయిదా

భీమునిపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బుధవారం విశాఖ పర్యటనకు వస్తున్నందున మండలంలోని నారాయణరాజుపేటలో జరగాల్సిన రెవెన్యూ సదస్సును వాయిదా వేసినట్టు తహసీల్దార్ పి.రామారావు తెలిపారు. ఈ సదస్సును తొమ్మిదో తేదీన నిర్వహిస్తామన్నారు.



బేడా మండపం చుట్టూ తిరువీధి ఉత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

అప్పన్న ఆలయంలో పగల్పత్ సేవ

సింహాచలం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి వాలయ వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారికి పగల్పత్ సేవను వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవ, ప్రభాత ఆరాధనలు పూర్తి చేశాక ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించి బంగారు తొళ్లక్కియాన్లో అధిష్ఠంపజేశారు. షోడశోపచారాలు సమర్పించిన తరువాత ఆస్థాన విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితుల మంత్రోచ్చరణల నడుమ బేడా మండపం చుట్టూ తీరువీధి ఉత్సవాన్ని జరిపారు. మార్గంలోని దిక్పాలకులకు పూజలు చేశారు. భక్తుల హరినామ స్మరణతో ఆలయం మార్మోగింది. ఆ తర్వాత ఆస్థాన మండపంలోని ప్రత్యేక వేదికపై స్వామి, అమ్మవార్లను అధిష్ఠింపజేసి స్థానాచార్యులు టీపీ రాజగోపాల్ ఆధ్వర్యంలో అధ్యాపకులు నాలాయిర దివ్య ప్రబంధ పారాయణ చేశారు.

12న ఘంటసాల పాటల పోటీలు

విశాఖపట్నం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఘంటసాల ది గ్రేట్ సినిమా త్వరలో విడుదలవున్న సందర్భంగా ఈనెల 12న నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఘంటసాల పాటల పోటీల్లో గాయనీగాయకులు పాల్గొనాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కోరారు. విశ్రాంత పోలీసు అధికారి సీహెచ్ రామారావు దర్శకత్వం వహించిన అమర గాయకుడు ఘంటసాల బయోపిక్ వచ్చే నెలలో విడుదల కానున్న సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఘంటసాల గానావధాని డా.రెహమతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనకు సర్వం సిద్ధం

... 5వ పేజీ తరువాయి

జనాలకు తరలిస్తున్నారు. ఇందుకు సుమారు ఏడు వేల వాహనాలను వినియోగిస్తున్నారు. పొరుగు జిల్లాల నుంచి వాహనాలు బుధవారం ఉదయమే బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకల్లా సభా ప్రాంగణానికి చేరుకునేలా ఏర్పాట్లుచేశారు.

మూడు బ్లాక్‌లు

ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో రెండు వేదికలు ఏర్పాటుచేశారు. ఒకటి ప్రధాన వేదిక. ప్రధాని, ఇతర ప్రముఖులు ఆశీనులయ్యేలా భారీగా రూపొందించారు. మరొకటి సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన కోసం ఏర్పాటుచేశారు. ప్రాంగణంలో మూడు బ్లాక్‌లు నిర్మించారు. ప్రధాని, ఇతరులు కూర్చునే వేదికకు ఎదురుగా ఒక బ్లాక్, దానికి ఇరువైపులా రెండు ఏర్పాటుచేశారు. జనాల కోసం 27 గ్యాలరీలు ఏర్పాటుచేసి ఒక్కొక్క దానిలో రెండు వేలకుపైగా కుర్చీలు వేశారు. ప్రముఖుల కోసం మరో ఆరు గ్యాలరీలు కేటాయించారు. మంత్రుల కోసం ఒక గ్యాలరీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లకు ఒక గ్యాలరీ, కూటమి పార్టీలకు చెందిన నేతలకు మరో రెండు గ్యాలరీలు, అధికారులకు ఒకటి, ఎస్పీపీసీ అధికారులకు ఒక గ్యాలరీ కేటాయించారు. ప్రతి గ్యాలరీకి ఒక జిల్లా అధికారిని ఇన్‌చార్జిగా నియమించారు. ప్రతి గ్యాలరీలో ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటుచేశారు. గ్యాలరీలో ఉన్నవారికి తాగునీరు అందించనున్నారు. మైదానం బయట బయో టాయ్‌లెట్లు అందుబాటులో ఉంచారు.

ఆరుబయట కూడా ఎల్ఈడీ స్క్రీన్లు

ప్రధాన మైదానానికి ఎదురుగా ఉన్న మరో మైదానంలో 15 వేల మంది కూర్చునేలా టెంట్ వేసి కుర్చీలు ఏర్పాటుచేశారు. అయితే గ్యాలరీలు నిండిన తరువాత రెండో మైదానంలో కూర్చో బెడతారు. ఆ తరువాత వచ్చిన వారు బ్లాకులు బయట నిల్చుని ప్రధానమంత్రి ప్రసంగం వినేందుకు అనువుగా ఆరుబయట ఎల్ఈడీలు అమర్చారు.

వేదిక వరకూ రోడ్‌షో

కాగా ప్రధాన మోదీ ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డు మార్గాన తాటిచెట్లపాలెం జంక్షన్, ఫ్లైవోవర్, దత్ ఐలాండ్ మీదుగా వెంకటాద్రి వంటిల్లు వద్దకు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్‌షోలో పాల్గొంటారు. రోడ్‌షో ప్రారంభం నుంచి వేదికపైకి వెళ్లేంత వరకూ జనాలు స్వాగతం పలికేలా రూట్ మ్యాప్ రూపొందించారు. బుధవారం సాయంత్రం 6.50 గంటల వరకూ సభ జరగనున్నందున ఫ్లడ్ లైట్లు ఏర్పాటుచేశారు. కాగా మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మంత్రులు, కూటమి పార్టీల నేతలు, అధికారులు పలు దఫాలు మైదానానికి వచ్చి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నగరం పోలీస్‌మయం

... 5వ పేజీ తరువాయి

మైదానంతోపాటు మద్దిలపాలెం, పిఠాపురం కాలనీ, వీఐపీ రోడ్డు, రేసపువానిపాలెం, ఏయూ ఇంజనీరింగ్ హాస్టళ్ల భవనాలు చుట్టుపక్కల బాంబ్ స్క్వాడ్‌లు, ఎన్ఎస్‌జీ బృందాలు విస్తృతంగా తనిఖీ చేస్తున్నాయి. ప్రధాని సభకు జనాలను తీసుకువచ్చే బస్సులు మద్దిలపాలెం డిపోలోకి వెళ్లడానికి బస్టాండ్ ఎదురుగా జాతీయ రహదారిపై డివైడర్‌ను తొలగించారు. అలాగే ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ ఆర్చ్ ద్వారా వీవీఐపీ వాహనాలు రాకపోకలు సులభంగా సాగేందుకు జాతీయ రహదారి, బీఆర్‌టీఎస్ రోడ్డుపై ఉన్న డివైడర్లను కూడా తొలగించారు. ఆ ప్రాంతాన్ని పూర్తిగా పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఏయూ ఇంజనీరింగ్ మైదానంలోకి జనాలు, వాహనాలు సులభంగా ప్రవేశించేందుకు వీలుగా పిఠాపురం కాలనీ వైపు రెండుచోట్ల ఏయూ మైదానం ప్రహరీ గోడను తొలగించారు. అదేవిధంగా ప్రధాని ఎయిర్‌పోర్టు నుంచి ఎన్ఏడీ జంక్షన్, తాటిచెట్లపాలెం, తెలుగుతల్లిఫ్లైఓవర్ మీదుగా దత్ ఐలాండ్‌కు చేరుకుంటారు కాబట్టి ఆ మార్గంలో బాంబ్‌స్క్వాడ్, ఎన్ఎస్‌జీ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేశాయి. ప్రతి వంద అడుగులకు ఒకరు చొప్పున పోలీస్ బీట్‌లు ఏర్పాటుచేశారు.

నైపుణ్య గణనకు సన్నాహాలు

... 5వ పేజీ తరువాయి

చేపట్టనున్నారు. మొదటిది సచివాలయ సిబ్బంది తమ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి 15 నుంచి 59 ఏళ్లలోపు వయసున్న వారి వివరాలను సేకరిస్తారు. చదువు (విద్యార్హత), ఉద్యోగం, జీతం, ఎటువంటి నైపుణ్యాలు కావాలనుకుంటున్నారు, ఇతర ఉద్యోగాలకు వెళ్లాలన్న ఆలోచన ఉంటే వాటి వివరాలను సేకరిస్తారు. రెండోది సెల్ఫ్ ఎన్యూమరేషన్. ఇందులో ఎవరికి వారే తమ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు అవకాశం ఉంటుంది. ఈ మేరకు నైపుణ్య అనే యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తోంది. స్కిల్ సెన్సస్ ప్రారంభమైన తరువాత ఈ యాప్ పనిచేస్తుందని అధికారులు చెబుతున్నారు.

శిక్షణ..ఉద్యోగ కల్పన5

నైపుణ్య గణన ద్వారా సేకరించిన సమాచారాన్ని మదింపు చేసిన తరువాత వివరాలను కేటగిరీలుగా విభజిస్తారు. ఇంటర్, డిగ్రీ, ఇతర ఉన్నత కోర్సులు పూర్తిచేసిన వారి జాబితా, పదో తరగతి కంటే తక్కువ చదువుకున్న వారి జాబితా, పూర్తిగా చదువుకోని వారి జాబితాను తయారుచేస్తారు. అర్హతకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇప్పటికే ఉద్యోగాలు చేస్తున్న వారికి మెరుగైన అవకాశాలు దక్కించుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటుంది. ఇటువంటి శిక్షణకు సదరు ఉద్యోగం చేస్తున్న అభ్యర్థులు ఆసక్తి చూపుతారా?, లేదా? అనేది కూడా గణనలోనే గుర్తిస్తారు. రానున్న రోజుల్లో ఉద్యోగావకాశాలకు కేంద్ర బిందువుగా మారనున్న ఏఐ, డ్రోన్ టెక్నాలజీ, ఇతర సాంకేతిక అంశాల్లో శిక్షణ పొందేందుకు ముందుకువచ్చే వారి కోసం ప్రత్యేక సంస్థలతో ప్రభుత్వం ఒప్పందం చేసుకోనున్నది. నైపుణ్య గణనలో సేకరించిన సమాచారాన్ని నిరుద్యోగ భృతి వంటి పథకాల అమలుకు కూడా ఆధారంగా తీసుకుంటారని అధికార వర్గాలు చెబుతున్నాయి.

నేటి నుంచి ఏపీ డిజిటల్ టెక్నాలజీ సదస్సు

... 5వ పేజీ తరువాయి

నారా లోకేశ్ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా సహకారం అందిస్తున్న ఈ సదస్సులో ఐటీ, ఐటీఈఎస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్, ఎలక్ట్రానిక్స్, స్మార్ట్ అండ్ సస్టెయినబుల్ టెక్నాలజీ, మెడికల్ అండ్ హెల్త్ టెక్నాలజీ, క్రియేటివ్ టెక్నాలజీలపై చర్చలు జరుగుతాయని ఏపీ డిజిటల్ టెక్నాలజీ ఇండస్ట్రీ లీడర్‌షిప్ ఫోరమ్ కన్వీనర్ శ్రీధర్ కొసరాజు తెలిపారు.

నేడు ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎం రాక

... 5వ పేజీ తరువాయి

చేరుకుని..ప్రధానికి వీడ్కోలు పలికి, రాత్రి 7.30 గంటలకు విమానంలో విజయవాడ వెళతారు. కాగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మధ్యాహ్నం 12 గంటలకు విశాఖ చేరుకుని నోవాటెల్‌కు వెళతారు. అక్కడ విశ్రాంతి తీసుకుని సాయంత్రం నాలుగు గంటలకు ఐఎన్ఎస్ డేగాకు వెళతారు. ప్రధానికి స్వాగతం పలికి ఆయనతోపాటు రోడ్‌షో, బహిరంగ సభలో పాల్గొంటారు. సభ ముగిసిన తరువాత తిరిగి విజయవాడ వెళతారు.

వీఎంఆర్‌డీఏ సెక్రటరీగా మురళీకృష్ణ

... 5వ పేజీ తరువాయి

సెక్రటరీ, ఎస్టేట్ అధికారి పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం భర్తీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక వార్షిక బదిలీల్లో భాగంగా వీఎంఆర్‌డీఏ సెక్రటరీ కీర్తిని విజయనగరం జిల్లా ఆర్‌డీఓగా బదిలీ చేసింది. ఇప్పుడు ఆ స్థానంలో డిప్యూటీ కలెక్టర్ పి.మురళీకృష్ణను నియమించింది. అలాగే ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డిని గతంలో అమరావతికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో డిప్యూటీ కలెక్టర్ బి.దయానిధిని నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

నైపుణ్యానికి ప్రతీక సివిల్ ఇంజనీరింగ్

సాగర్‌నగర్, జనవరి7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోని నిలువెత్తు భవనాలు, భారీ వంతెనలు, ఆకట్టుకునే కట్టడాల వెనక సివిల్ ఇంజనీరింగ్ నిపుణుల నైపుణ్యం దాగివుందని, రానున్న రోజుల్లో సివిల్ ఇంజనీరింగ్‌కు మరింత ప్రాధాన్యం పెరగనున్నట్టు ఎన్ఐటీ రాయపూర్, ఆంధ్రప్రదేశ్‌ల డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ రమణారావు పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని సివిల్ ఇంజనీరింగ్‌విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంజనీరింగ్ విద్యలో ఎన్ని కొత్త కోర్సులు వచ్చినా సివిల్ ఇంజనీరింగ్ నిపుణులకు డిమాండ్ ఉంటుందన్నారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ కె.నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ శరీరాన్ని యోగా ప్రక్రియలో ఏవిధంగా సమతుల్యతతో ఉంచుతామో.. సివిల్ ఇంజనీరింగ్‌లో డిజైనింగ్ నుంచి కట్టడం పూర్తి అయ్యేంతవరకు నిలకడలను ప్రదర్శించాలన్నారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ డి.ముకుందరావు, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.చందనకుమార్, తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లకు త్రీమెన్ కమిటీల నియామకం?

మధురవాడ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కొన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు త్వరలో ప్రభుత్వం త్రీమెన్ కమిటీలను నియమించనున్నట్టు తెలిసింది. గత ఏడాది డిసెంబరు 21తో పీఏసీఎస్‌లలో స్పెషలాఫీసర్ల గడువు పూర్తవ్వడంతో కూటమి ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులిచ్చింది. ఇదిలావుండగా ఉండగా పీఏసీఎస్‌లకు ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించేంత వరకు త్రీమెన్ కమిటీలని నామినేట్ చేయనున్నట్టు సమాచారం. అంటే ఇప్పటికే సహకార సంఘంలో ఉన్న సభ్యుల్లో ముగ్గురిని నామినేట్ చేసి, వారిలో ఒకరిని అధ్యక్షుడిగా నియమించే అవకాశం ఉంది. కాగా మధురవాడ పీఏసీఎస్‌కు గత పదిహేనేళ్ల నుంచి అనివార్య కారణాల వల్ల ఎన్నికలు నిర్వహించలేదు. ఈ నేపథ్యంలో మధురవాడ పీఏసీఎస్‌కు కూడా త్రీమెన్ కమిటీని ఏర్పాటు చేస్తారని ఆశావహులు ఎదురు చూస్తున్నారు.

ఉక్కును సెయిల్‌లో విలీనం చేస్తున్నట్టు పీఎం ప్రకటించాలి

- స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అన్ని పార్టీలు గళం విప్పాలి
- పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరామ్
- 36 గంటల నిరాహార దీక్షలో కూర్చున్న 36 మంది కార్మికులు



36 గంటల దీక్షా శిబిరంలో కార్మికులు, ఉక్కు పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేస్తున్నట్టు బుధవారం విశాఖ పర్యటనకు విచ్చేస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టమైన ప్రకటన చేయాలని పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరామ్‌లు కోరారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలోని దీక్షల శిబిరం వద్ద 36 మంది కార్మికులు 36 గంటల పాటు (మంగళవారం ఉదయం 8 నుంచి బుధవారం రాత్రి 8 గంటల వరకు) నిరాహార దీక్ష చేపట్టారు. వారికి సంఘీభావంగా సుమారు 500 మంది కార్మికులు, నిర్వాసితులు దీక్షా శిబిరంలో కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1,426 రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం దారుణమన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని, లేదా సెయిల్‌లో విలీనం చేసి పూర్తి స్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో నడుపుతామని ప్రధాని ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగులకు తక్షణమే నాలుగు జీతం బకాయిలను తక్షణమే చెల్లించాలని, మూడేళ్ల పాటు ట్యాక్స్ హాలిడే ఇవ్వాలని, ప్లాంటుకు సొంత గనులు కేటాయించాలని, నిలిపివేసిన 800 మంది కాంట్రాక్టు కార్మికులకు వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలన్నారు. కర్ణాటక రాష్ట్రంలోని విశ్వేశ్వరయ్య స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ఉక్కు శాఖా మంత్రి కుమారస్వామి రూ.15 వేల కోట్లు ప్రకటించారని, అదేవిధంగా విశాఖ ఉక్కు కర్మాగారానికి కూడా ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చి ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్మికులు శ్రమించి ఉత్పత్తిని సాధిస్తున్నా నాలుగు నెలలుగా పూర్తి స్థాయిలో జీతాలు చెల్లించకుండా ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టి వారి కుటుంబాలు రోడ్డున పడేలా చేయడం సమంజసం కాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. యువతకు భద్రతతో కూడిన ఉపాధి అవకాశాలు కల్పించాలని, అన్ని రాజకీయ పార్టీలు ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తమ గళాన్ని విప్పాలన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య చిత్ర యూనిట్ సభ్యులు ఎం.సేనాపతి, రెహమాన్, విజయ్‌కుమార్‌లు ఉక్కు కార్మికులకు సంఘీభావాన్ని తెలిపారు.

కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు కేఎస్ఎన్ రావు, ఎన్.రామారావు, నీరుకొండ రామచంద్రరావు, జెర్రిపోతుల ముత్యాలు, యు.రామస్వామి, వరసాల శ్రీనివాసరావు, జె.రామకృష్ణ, వి.ఫైడిరాజు, వి.రామ్మోహన్‌కుమార్, ఎన్.సింహాద్రి, డి.అప్పారావు, పెంటారావు, వైటీ దాస్, కారు రమణ, కెఎం శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన వంతెన మరమ్మతు పనులు

- రహదారి సగ భాగం వరకు స్టాపర్ల ఏర్పాటు
- తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని ఎన్‌హెచ్ఏఐ అధికారులు



వంతెనపై రోడ్డు సగం వరకు స్టాపర్‌లు ఏర్పాటు చేసిన దృశ్యం

అగనంపూడి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి అగనంపూడి ఫ్లై ఓవర్ మరమ్మతు పనులు నత్తనడకన సాగుతున్నాయి. అనకాపల్లి నుంచి గాజువాక మార్గంలో గల బ్రిడ్జిపై గత మూడు వారాలుగా మరమ్మతు పనులు చేపడుతున్నారు. ఇందుకోసం రోడ్డు సగ భాగం వరకు స్టాపర్లను ఏర్పాటు చేశారు. దీంతో రోడ్డు కుదించుకుపోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జాతీయ రహదారి కావడంతో ఇటుగా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అలాగే నగరం నుంచి ఫార్మాసిటీకి ఉద్యోగులు, కార్మికుల రాకపోకలుతో రద్దీగా ఉంటుంది. బ్రిడ్జి దగ్గరకు వచ్చేసరికి రహదారిపై సగ భాగం స్టాపర్లు అడ్డుగా ఉండడంతో వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందులు తలెత్తున్నాయి. దీంతో ట్రాఫిక్‌కు తరచూ తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. సాయంత్రం ఆరు నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు అయితే వాహనాలు భారీగా స్తంభిస్తున్నాయి. అది ఫార్మా ఉద్యోగులు వచ్చే సమయం కావడంతో వాహన చోదకులు ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నారు. లంకెలపాలెం నుంచి అగనంపూడి వెళ్లాలంటే సమారు గంట సమయం పడుతుందంటే పరిస్థితి ఎలాగుందో అర్థం చేసుకోవచ్చు. నిత్యం ట్రాఫిక్ అధికంగా ఉండే రహదారిలో మరమ్మతు పనులను వేగవంతం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఎన్‌హెచ్ఏఐ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనులు మందకొడిగా సాగుతున్నాయని పలువురు వాహన చోదకులు ఆరోపిస్తున్నారు. అందువల్ల ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరితగతిన పనులు జరిగేలా చర్యలు చేపట్టడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



ట్రాఫిక్ స్తంభించడంతో బారులుతీరి నిలిచిన వాహనాలు

ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలి

-మజ్జి శ్రీను, పెదమడక



అగనంపూడి బ్రిడ్జిపై పనులు చేపడుతుండడంతో నిత్యం ఇక్కడ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. రోడ్డు సగ భాగంలో స్టాపర్లను పెట్టడంతో వాహనదారులు నానాపాట్లు పడుతున్నారు. ఎన్‌హెచ్ఏఐ అధికారులు రోడ్డు మరమ్మతు పనులను త్వరితంగా పూర్తి చేయాలి. సాయంత్రం పూట లంకెలపాలెం నుంచి అగనంపూడి వెళ్లాలంటే చాలా సమయం పడుతుంది. ట్రాఫిక్ స్తంభించి పెద్ద ఎత్తున వాహనాలు బారులుతీరి నిలిచిపోతుండడంతో ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి.

షిప్‌యార్డులో మీట్ అండ్ గ్రీట్

మల్కాపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ కంపెనీలో మంగళవారం మీట్ అండ్ గ్రీట్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ సీఎండీ కార్యాలయ ఆవరణలో 160 మంది వ్యాపార భాగస్వాములతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ హేమంత్ ఖత్రీ సంస్థ సాధించిన విజయాలను వివరించారు. సంస్థ అభివృద్ధికి అందించాల్సిన సహకారం కోసం భాగస్వాములను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు సంస్థ అభివృద్ధిలో భాగస్వాములైన వారందరికీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

'కళింగ' డైరెక్టర్‌గా రమణారావు ప్రమాణ స్వీకారం

గోపాలపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా 89వ వార్డు ఖారవేలనగర్‌కు చెందిన పొన్నాడ రమణారావు ఇటీవల నియమితులయ్యారు. ఈ మేరకు గొల్లపూడిలోని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ సమక్షంలో రమణారావు డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. కార్పొరేషన్ డైరెక్టర్‌గా తన నియామకానికి కృషి చేసిన పశ్చిమ ఎమ్మెల్యే గణబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేషన్ అభివృద్ధికి తనవంత కృషి చేస్తానని రమణారావు పేర్కొన్నారు.

సినిమా గైడ్

- **బచ్చలమల్లి:** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)
- **విడుదల-2:** శ్రీకన్య, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని(గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **యువి:** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)
- **ముఫాసా:** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **పుష్ప-2:** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 35, టమాటా 14, వంకాయలు (తెలుపు)34, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 46, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 40, బీరకాయలు 50, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 18, క్యారెట్ 46 దొండకాయలు 44, బంగాళదుంపలు 27, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది)50, బరబాటి 44, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 34 దోస కాయలు 36, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 50, పొటల్స్ 60, కీరదోస 34, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 46, చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 44, కొండఉసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్యాప్సికం... క్యాబెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	510
విజయనగరం	514
శ్రీకాకుళం	514

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	102
లైవ్ ధర	122
విత్ స్కిన్	214
స్కిన్‌లెస్	224

దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు బోసియా పోటీలు

- జాతీయ బోసియా స్పోర్ట్స్ ఫెడరేషన్ సెక్రటరీ జనరల్ షమిందర్ సింగ్ ఢిల్లన్



విలేకరుల సమావేశంలో షమిందర్ సింగ్ ఢిల్లన్, తదితరులు

గాజువాక, జనవరి 7: దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడమే ధ్యేయంగా ఈ నెల పదో తేదీ నుంచి జాతీయ స్థాయి బోసియా పోటీలను విశాఖ మెడ్‌టెక్‌లో నిర్వహిస్తున్నట్టు జాతీయ బోసియా స్పోర్ట్స్ ఫెడరేషన్ సెక్రటరీ జనరల్ షమిందర్ సింగ్ ఢిల్లన్ పేర్కొన్నారు. మెడ్‌టెక్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన 103 మంది దివ్యాంగులు పాల్గొంటున్నట్టు తెలిపారు. ఈ పోటీల నిర్వహణకు ప్రాంగణంతో పాటు అన్ని రకాల సహాయ సహకారాలను మెడ్‌టెక్ అందిస్తున్నట్టు తెలిపారు. మెడ్‌టెక్ జోన్ అసిస్టెంట్ టెక్నాలజీ హెడ్ అమిత్‌కుమార్ శర్మ మాట్లాడుతూ క్రీడారంగానికి మెడ్‌టెక్ సంస్థ సంపూర్ణ సహకారాన్ని అందిస్తుందన్నారు. మెడ్‌టెక్ జోన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా క్రీడారంగంలో ప్రోత్సహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర పారా బోసియా స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సురవరపు రామన్ సుబ్బారావు మాట్లాడుతూ వీల్‌ఛైర్‌కే పరిమితమై ఇళ్లల్లో కదల్లేని స్థితిలో ఉన్న దివ్యాంగుల్లో మనోధైర్యాన్ని నింపేందుకు ఇటువంటి పోటీలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు రుక్మాకరరావు, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు: తహసీల్దార్ శ్రీవల్లి



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీవల్లి

అగనంపూడి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ పరమైన సమస్యలను పరిష్కరించడం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని, వీటిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని గాజువాక తహసీల్దార్ తోట శ్రీవల్లి కోరారు. పెదమడక కమ్యూనిటీ హాల్ వద్ద మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భూములకు సంబంధించి ఎలాంటి సమస్యనైనా సదస్సు ద్వారా పరిష్కరించుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందన్నారు. ఆయా సమస్యలను ప్రజలు దరఖాస్తు ద్వారా రెవెన్యూ అధికారులకు తెలియజేయాలన్నారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం 45 రోజుల్లోగా సమస్య పరిష్కారం అవుతుందని శ్రీవల్లి పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలకు సంబంధించి పలువురు దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, స్థానిక నాయకులు దుల్ల రామునాయుడు, కర్రి దశేంద్ర, ఇల్లపు ప్రసాద్, ఎం.విజయ్,బి.సత్యనారాయణ, జి.అప్పారావు, ఎం.వెంకటరావు, వసంతరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని సభకు 4 లక్షల మంది జన సమీకరణ

మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు



మాట్లాడుతున్న పత్తిపాటి పుల్లారావు

పెందుర్తి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ రోడ్‌షో, సభకు ఉత్తరాంధ్ర నుంచి నాలుగు లక్షల మందితో జన సమీకరణ చేస్తున్నామని మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు అన్నారు. సుజాతనగర్‌లోని దాట్ల మేన్షన్స్‌లో మంగళవారం ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కూటమి నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాని సభ చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహించనున్నామన్నారు. విశాఖ నుంచి రూ.రెండు లక్షల విలువ గల ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారంటే ఆ ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. ప్రధాని విశాఖ పర్యటన రాష్ట్ర భవిష్యత్తుకు ఎంతో కీలకమన్నారు. మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ జోడీతో అన్ని రంగాల్లో ఏపీ నంబర్‌వన్ కాగలదని పేర్కొన్నారు. సమావేశంలో టీడీపీ పెందుర్తి ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, నాయకులు రెడ్డి నారాయణరావు, దాట్ల మధు, సేనాపతి శంకరరావు, ఎ.అప్పలనాయుడు, బుచ్చిరాజు, గొర్లె రామునాయుడు, ఐతి సింహాచలం, పి.జగన్మోహనపాత్రుడు, జి. అప్పారావు, ఆర్ఎస్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మోదీ సభను విజయవంతం చేయాలి: నల్లూరు సూర్యనారాయణ

కూర్మన్నపాలెం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక తొలిసారిగా విశాఖలో బుధవా రం జరగనున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సభను కూటమి నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయవలసిందిగా టీడీపీ 86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ కోరారు. వార్డు పరిధిలోని మాతృశ్రీ నగర్‌లో ఉన్న టీడీపీ కార్యాలయంలో మంగళవారం రాత్రి జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీఎంతో పాటు ఈ సభకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హాజరవుతున్నందున అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొనవలసిందిగా పిలుపునిచ్చారు. సమావేశంలో కూటమి నాయకులు వేగుంట శ్రీనివాస్, కాద శ్రీను, గంధం వెంకటరావు, రామారావు, వెంకటేశ్, రమేశ్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే 87వ వార్డులో మంగళవారం రాత్రి నిర్వహించిన కూటమి నాయకుల సమావేశంలో కార్పొరేటర్ బొండా జగన్ మాట్లాడుతూ పీఎం మోదీ సభను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, సూరిశెట్టి పెంటారావు, ఎం.రాము, ఎల్.సోంబాబు, ఎస్.కనకరాజు, సత్తిబాబు, పి.దానయ్య, కృష్ణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు. ఆటోనగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఏపీఐఐసీ, ఐలా కమిటీ సభ్యులు సీహెచ్ విశాలాక్షి, మూర్తిలు మాట్లాడుతూ పారిశ్రామిక వేత్తలందరూ మోదీ సభలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

'భెల్' క్రికెట్ పోటీల షెడ్యూల్ విడుదల

అక్కిరెడ్డిపాలెం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): భెల్ హెచ్‌పీవీపీ హార్ట్‌ఫుల్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరగనున్న భెల్ విశ్రాంత ఉద్యోగుల కుమారుల క్రికెట్ పోటీల షెడ్యూల్‌ను మంగళవారం డ్యాన్స్ మాస్టర్లు పొట్టి రమేశ్, పండు, కండక్టర్ ఝాన్సీలు ఆవిష్కరించారు. భెల్ క్రీడా మైదానంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతు భెల్ ప్రస్తుత ఉద్యోగులతో పాటు విశ్రాంత ఉద్యోగుల పిల్లలతో నిర్వహించనున్న ఈ క్రికెట్ పోటీల వల్ల వారి మధ్య మరింత స్నేహ బంధాలు పెరుగుతాయన్నారు. ఈ నెల పదో తేదీ నుంచి మూడు రోజుల పాటు భెల్ హెచ్‌పీవీపీ క్రీడా మైదానంలో నిర్వహించే ఈ పోటీల్లో మొత్త ఎనిమిది జట్లు పాల్గొంటున్నాయని అసోసియేషన్ అధ్యక్షుడు జె.రాము తెలిపారు. కార్యక్రమంలో ప్రతినిధులు ఎం.కుమార్, సమీర్, అమర్, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ చేరిన ఫణికుమార్ మృతదేహం



ఫణికుమార్ కుటుంబీకులను ఓదారుస్తున్న 'పల్లా'

పెదగంట్యాడ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యనభ్యసించేందుకు కెనడా వెళ్లి అక్కడ అనుమానాస్పదంగా మృతి చెందిన ఫణికుమార్ మృతదేహాన్ని సోమవారం రాత్రి నగరానికి తీసుకు వచ్చారు. మృతుని కుటుంబీకులు ఫణికుమార్ మృతదేహాన్ని చట్టివానిపాలెం తరలించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు,ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మంగళవారం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుని తండ్రి పిల్లి నాగప్రసాద్, ఇతర కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఫణికుమార్ మృతదేహాన్ని కెనడా నుంచి ఇక్కడకు తీసుకురావడానికి పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ శ్రీభరత్ ఎంతో కృషి చేశారని వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఫణికుమార్ కుటుంబ సభ్యులను తాము అండగా ఉంటామని పల్లా పేర్కొన్నారు. అనంతరం ఫణికుమార్ మృతదేహాన్ని చట్టివానిపాలెంలోని శ్మశాన వాటికకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

ఉక్కు ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని వినతి

కూర్మన్నపాలెం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉక్కు ఉద్యోగులకు వేతనాలు, వితంతువులకు పెన్షన్లు తక్షణమే చెల్లించేలా చొరవ చూపాలని కోరుతూ ఉక్కు అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి కేవీడీ ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు మంగళవారం అమరావతిలోని సచివాలయంలో వినతిపత్రం అందజేశారు. నాలుగు నెలలుగా ఉక్కు ఉద్యోగులకు వేతనాలు, వితంతువులకు పింఛన్లు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అమరావతిలోని నిర్మాణాలకు, పేదల ఇళ్ల కోసం విశాఖ ఉక్కును వినియోగించుకోవాలని కోరారు.

స్టీల్‌ప్లాంటును ప్రైవేటీకరించరాదంటూ సీపీఎం నిరసన

పెదగంట్యాడ, జనవరి 7: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ యత్నాలను కేంద్రం తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఐ గాజువాక నియోజకవర్గ నాయకులు మంగళవారం పెదగంట్యాడ జంక్షన్‌లో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఇక్కడి పోతిన సన్యాసిరావు భవన్ నుంచి పెదగంట్యాడ కూడలి వరకు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో నియోజకవర్గ కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటుపరం కాదని పీఎం మోదీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.అచ్యుతరావు సీపీఐ నాయకులు జి.ఆనంద్, ఈశ్వర్, పి.దుర్గారావు, కె.వనజాక్షి, పి.పద్మ, తదితరులు పాల్గొన్నారు.

టీఎస్సార్ టీబీకే కళాశాలలో సంక్రాంతి సంబరాలు



డూడూ బసవన్నతో తలసిల బలరామకృష్ణ

శ్రీనగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి టీఎస్సార్ టీబీకే కళాశాల ఆవరణలో మంగళవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. తెలుగుదనం ఉట్టిపడే వస్త్రధారణతో సంబరాల్లో విద్యార్థులు సందడి చేశారు. డూడూ బసవన్నల సందడి, హరిదాసు కీర్తనలు, సంప్రదాయ నృత్యాలు, రంగుల ముగ్గులు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ తలశిల బలరామకృష్ణ, ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధన్, కరస్పాండెంట్ తలశిల ఉమామహేశ్వరరావు, కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుభాషిణి, విజయ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

శీతాకాలంలో వృద్ధులు, చిన్నారుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

-డాక్టర్ ఎం.సుధాకరరావు, వైద్యాధికారి, గాజువాక పీహెచ్‌సీ



ప్రశ్న: హెచ్ఎంపీవీ వైరస్ ఏ వయసు వారికి సోకే అవకాశం ఉంది?

జవాబు: ఈ వైరస్ ప్రధానంగా చిన్నారులు, వృద్ధులు, ఇమ్యూనిటీ తక్కువ ఉన్నవారికి త్వరితంగా సోకే అవకాశం ఉంది. అందువల్ల అటువంటి వారి పట్ల కుటుంబ సభ్యులు అప్రమత్తంగా ఉండాలి.

ప్ర: శీతాకాలంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జ: చల్లని వాతావరణంలో తిరగకుండా జాగ్రత్తలు పాటించాలి. వృద్ధులు, చిన్నారులకు జలుబు, దగ్గు, జ్వరం వస్తే తక్షణమూ వైద్యులను సంప్రదించాలి.

ప్ర: ఆరోగ్యంగా ఉండాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలి?

జ: అన్ని రకాల పోషకాలు కలిగిన ఆకుకూరలను ఎక్కువగా తీసుకోవాలి. పండ్లు, పండ్ల రసాలను తాగాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్ర: ప్యాకేజ్డ్, బయట ఫుడ్ తీసుకుంటున్న వారికి మీ సూచనలు?

జ: బయట విక్రయించే ఫుడ్‌లో రుచి కోసం వివిధ రకాల మసాలా పొడులను, రంగులను వాడుతారు. అటువంటి ఆహారాన్ని తీసుకోవడం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుంది. అటువంటి వంటకాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది.



దీక్ష శిబిరంలో కార్మికులతో పాటు కూర్చున్న శ్రీకుమార్

ఎన్ఏడీ కార్మికుల పోరాటానికి అండగా ఉంటాం

ఏఐడీఈఎఫ్ ప్రధాన కార్యదర్శి శ్రీకుమార్

ఎన్.ఎ.డి.జంక్షన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎన్ఏడీలో అన్యాయంగా 36 మంది కార్మికులను సస్పెండ్ చేయడంతో పాటు ఆరుగురిపై పోలీస్ కేసులు పెట్టడం దారుణమని, దీనిని నిరసిస్తూ కార్మికులు చేస్తున్న సత్యాగ్రహ దీక్షల పోరాటానికి తాము అండగా ఉంటామని ఏఐడీఈఎఫ్ ప్రధాన కార్యదర్శి శ్రీకుమార్ అన్నారు. ఎన్ఏడీ ఎదురుగా మంగళవారం సాయంత్రం ఆరు గంటలకు నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో ఎక్కడా కూడా ఒకేరోజు ఇంతమందిని సస్పెండ్ చేసిన దాఖలాలు లేవన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం సామరస్యంగా కార్మికులతో చర్చించి సస్పెన్షన్లను ఎత్తివేయాలని కోరారు. ఇటీవల కాలంలో పలు కంపెనీల యాజమాన్యాలు కార్మికుల పట్ల వ్యవహరిస్తున్న తీరు బాగోలేదన్నారు. ఎన్ఏడీ సీఈ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఏవీ థామస్ మాట్లాడుతూ గతంలో ఎన్నో పోరాటాలు చేశామని, కానీ 46 రోజులుగా పోరాటం చేసిన దాఖలాలు లేవన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం మానవతా దృష్టితో సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐడీఈఎఫ్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గోపాలకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్యుతరావు, ఎన్ఏడీ సీఈ యూనియన్ నాయకులు సబ్బం కేరిన్, యు.అప్పలరాజు, సునీల్, వీపీ రాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చింతలలోవలో తాళం వేసిన ఇంట్లో చోరీ

- ఇంటి యజమాని కేకలు వేయడంతో నగదు, వెండి ఆభరణాలతో మూడో ఫ్లోర్ నుంచి కిందకు దూకేసిన దొంగ



తలుపు తాళం తీసిన దృశ్యం

సింధియా, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. 63వ వార్డు పరిధి చింతలలోవకు చెందిన ఆటో డ్రైవర్ నాగల రాజేశ్ ఇంట్లో మంగళవారం వేకువజాము మూడు గంటల సమయంలో ఓ దొంగ చొరబడి మూడో ఫ్లోర్‌లో తలుపులకు వేసివున్న తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. పై ఫ్లోర్ నుంచి చిన్నపాటి శబ్ధాలు రావడంతో కింద ఫ్లోర్‌లో ఉన్న రాజేశ్ పెద్దగా కేకలు వేస్తూ పైకి వెళ్లారు. దీంతో దొంగ మూడో ఫ్లోర్ నుంచి కిందనున్న ఓ రేకుల షెడ్డుపైకి రూ.రెండు లక్షల నగదు, మూడు తులాల వెండి ఆభరణాలతో దూకేశాడు. చిన్నపాటి గాయాలకు గురైనప్పటికీ దొంగ తన చెప్పులను అక్కడే వదిలేసి పారిపోయాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు మల్కాపురం క్రైమ్ ఎస్ఐ ఎంవీ రమణ తెలిపారు.

ప్రధాని సభను విజయవంతం చేయాలి: మంత్రి మనోహర్




జనసేన కార్యాలయంలో వీర మహిళలను ఉద్దేశించి మాట్లాడుతున్న రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్
వేదికపై ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, లోకం నాగమాధవి తదితరులు

సీతంపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటనను విజయవంతం చేయాలని పౌర సరఫరాలు, ఆహారం, వినియోగదారుల వ్యవహారాల మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. సీతంపేట రాజేంద్రనగర్‌లోని జనసేన పార్టీ నగర కార్యాలయంలో మంగళవారం వీర మహిళలతో సమావేశాన్ని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీర మహిళలను ఉద్దేశించి మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ కూటమి అధికారంలోకి రావడానికి కృషి చేసిన మహిళలను అభినందించారు. రానున్న రోజుల్లో వీర మహిళలు ప్రతి ఒక్కరికీ గుర్తింపు లభించేలా చర్యలు చేపడతామన్నారు. నియోజకవర్గాల వారీగా కమిటీల్లో గుర్తింపు వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో విజయనగరం జిల్లా నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి, వివిధ నియోజకవర్గాల ఇంచార్జ్‌లు, ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్తలు, కార్పొరేటర్లు, మహిళా వార్డ్ అధ్యక్షులు, వీర మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మోదీ రోడ్డు షోను జయప్రదం చేయండి

మురళీనగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ బుధవారం నాటి నగర పర్యటన, రోడ్‌షోను విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ 50వ వార్డు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ప్రజల్ని, రాజకీయ పార్టీల ప్రతినిధులు, కార్యకర్తల్ని కోరారు. మాధవస్వామి జీవీఎంసీ కల్యాణమండపంలో మంగళవారం వార్డు యూసీడీ సీఓ ఉదయ్‌కుమార్, ఆర్పీలు, కూటమి నాయకులతో సమావేశం నిర్వహించి పర్యటన షెడ్యూల్, ఏర్పాట్లపై చర్చించారు.

కొండవాలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం



శ్యామలా దీపికకు పుష్పగుచ్ఛంతో స్వాగతిస్తున్న కార్పొరేటర్ వెంకటరమణ

మాధవధార, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మాధవధార మహత్ కాలనీలో మంగళవారం కొండ మెట్లు, నివాసాల ఎదుట కాల్వల పునర్నిర్మాణ పనులకు వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ భూమిపూజ చేశారు. జీవీఎంసీ రూ.10 లక్షలతో ఈ పనుల్ని కాంట్రాక్టు ప్రాతిపదికన చేపట్టనున్నారు. పనుల ప్రారంభ కార్యక్రమానికి విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు తరఫున ఆయన కుమార్తె శ్యామల దీపిక హాజరయ్యారు. పార్టీ భేదభావాలు లేకుండా కార్పొరేటర్ వెంకటరమణ (వైసీపీ) ఆమెకు (బీజేపీ) పుష్పగుచ్ఛం అందజేసి కార్యక్రమానికి స్వాగతించారు. వార్డు అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు తెలుగుదేశం నాయకులు, జనసేన ప్రతినిధులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యంలో పురుగులు, రాళ్లు!



29వ వార్డులో పంపిణీ చేసిన బియ్యం

మహారాణిపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి కోటాగా ఈ నెల పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం నాసిరకంగా ఉన్నాయి. సంక్రాంతి పండుగ రోజుల్లో పురుగులు, రాళ్ల ఉన్న బియ్యం పంపిణీ చేయడంతో పేదవర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. దక్షిణ నియోజకవర్గం మహారాణిపేట పరిధిలో ఇస్తున్న బియ్యం వండుకొని తినలేని విధంగా ఉన్నాయి. తెలుగు ప్రజలకు అత్యంత ప్రాధాన్యత ఉన్న జనవరి నెలలో రేషన్ ద్వారా పేదలకు ఇచ్చే బియ్యంలో నాణ్యత లేకపోవటంతో వాటిని తీసుకున్నవారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బియ్యంలో పురుగులు, నల్లరాళ్ల పొట్టు అధికంగా ఉండటంతో వాటిని తీసుకోవటానికి వెనకడుగు వేస్తున్నారు. బియ్యం ఇలా ఉన్నాయేంటని రేషన్ ఇస్తున్న వ్యాన్ సిబ్బందిని నిలదీస్తున్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పేద వర్గాలకు పండుగ సమయంలో 'సంక్రాంతి కానుకలు' అందించేవారు. ఇప్పుడు అవి లేకపోగా పురుగులు పట్టిన నాసిరకం బియ్యం పంపిణీ చేస్తుండటంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండుగ సమయంలో పిండి వంటలు చేసుకునేవారు ఈ బియ్యాన్ని అధికంగా వినియోగిస్తారు. ఈసారి బియ్యం వినియోగించటానికి అనుకూలంగా లేకపోవటంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

గుడ్డ సంచులనే వినియోగించండి



వినియోగదారునికి గుడ్డ సంచి అందిస్తున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

అక్కయ్యపాలెం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్‌ను ఎక్కువసార్లు ఉపయోగించకుండా గుడ్డ సంచులను మాత్రమే వినియోగించాలని జేడీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ ప్రజలకు పిలుపునిచ్చారు. గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్ రైతుబజారు ఎదుట ప్లాస్టిక్ నియంత్రణపై జేడీ ఫౌండేషన్ ప్రతినిధులు, జీవీఎంసీ సిబ్బంది సంయుక్తంగా వినియోగదారులకు మంగళవారం అవగాహన కల్పించి గుడ్డ సంచులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్లాస్టిక్ నియంత్రణలో జీవీఎంసీకి తమ ఫౌండేషన్ పూర్తి సహకారం ఉంటుందన్నారు. ఇందుకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఉత్తరాంధ్ర కన్వీనర్ కారుమూడి అను, రైతు బజారు ఎస్టేట్ అధికారి కొండబాబు, వార్డు పారిశుధ్య పర్యవేక్షకుడు శ్రీకాంత్, పారిశుధ్య కార్యదర్శులు శివ, నానాజీ, అలిమ, ఫాతిమా, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్‌లో సవరణలకు అవస్థలు

జోన్-4 కార్యాలయంలో సాంకేతిక కారణాలతో సేవలు బంద్



ప్రజలకు సేవలందించని జోన్-4 కార్యాలయంలోని ఆధార్ కేంద్రం

జగదాంబ కూడలి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆధార్‌లో సవరణల కోసం వెళ్లే ప్రజలకు అవస్థలు తప్పడంలేదు. ఆధార్‌లో తప్పులను సరిచేసుకోవడం, పెళ్లయిన వారు ఇంటి పేరు, మొబైల్ ఫోన్ నెంబరు అనుసంధానించడం, సంక్షేమ పథకాల కోసం ఆధార్ లో సవరణలు తప్పనిసరి కావడంతో ఆ కేంద్రాల చుట్టూ జనం తిరగాల్సి వస్తోంది. సచివాలయాలు, బ్యాంకుల వద్ద ఆధార్ సేవలు పూర్తిగా నిలుపుదల చేశారు. ఈ నేపథ్యంలో సవరణల కోసం ప్రజలు ఆధార్ కేంద్రాల అన్వేషణలో పడ్డారు. నగర పరిధిలో అనేక చోట్ల ఈ కేంద్రాల జాడ లేదు. జగదాంబ జంక్షన్ వద్ద జీవీఎంసీ జోన్-4 కార్యాలయం సేవలు దక్షిణ నియోజకవర్గం ప్రజానీకంతో పాటు నగరంలోని పలు వార్డుల ప్రజలకు ఉపయుక్తంగా ఉండేవి. అయితే జోన్-4లో ఆధార్ కేంద్రం కొద్ది రోజులు పూర్తి స్థాయిలో సేవలు అందించలేని పరిస్థితి నెలకొంది. ఆధార్‌కు సంబంధించిన లింకు ఫెయిల్యూర్ కావడం, సాంకేతిక కారణాలతో సేవలు నిలిచిపోయాయి. ఆధార్ సవరణల కోసం ఎంతో ఆశతో వచ్చే వారికి ఇక్కడ సేవలు లభ్యం కాకపోవడంతో నిరాశకు లోనవుతున్నారు. కొంతమంది అత్యవసరంగా ఆధార్ సవరణలు చేసుకోవాల్సి రావడంతో సేవలు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరంలో ఎక్కడ ఆధార్ సేవలు అందుబాటులో ఉన్నాయో తెలుసుకొనే పరిస్థితి ఎదురవుతోంది. జోన్-4లో ఆధార్ సేవలు గత నెలాఖరు నుంచి అందుబాటులో లేనట్లు సవరణల కోసం ఈ కేంద్రాలకు వచ్చే ప్రజానీకం చెబుతున్నారు. మరో రెండు, మూడు రోజుల వరకు ఆగాల్సి ఉంటుందని ఆధార్ కేంద్రాల సిబ్బంది చెబుతున్నారు. జోనల్ అధికారులు ప్రజల అవసరార్థం ఆధార్ కేంద్రంలో సాంకేతిక లోపాలను సరిచేసి సేవలను అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేస్తున్నారు.

నిరుపయోగంగా చేపల మార్కెట్ భవనం



ఖాళీగా ఉన్న మోడ్రన్ ఫిషింగ్ మార్కెట్ భవనం



ఆరుబయటే అమ్మకాలు సాగిస్తున్న మత్స్యకారులు

మహారాణిపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రజాధనం సద్వినియోగం చేయడంలో అధికారుల అలసత్వం ఎలాంటిదో చెప్పే ఉదాహరణ ఇది. చేపల మార్కెట్ భవనాన్ని నిర్మించి నిరుపయోగంగా వదిలేయడంతో ఆరుబయటే మత్స్యకారులు విక్రయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఫిషింగ్ హార్బర్‌లో సుమారు రూ.2.5 కోట్లతో అధునాతన సాంకేతిక సదుపాయాలతో సుమారు 108 బ్లాక్‌లను నిర్మించారు. భవనాన్ని నాలుగైదు నెలల క్రితం ప్రారంభించారు. ఇందులో కేవలం వారం, పది రోజులు మాత్రమే చేపల అమ్మకాలు సాగించిన మత్స్యకారులు అనంతరం ఆరుబయటకు వచ్చేశారు. మొదటి నుంచి ఫిషింగ్ హార్బర్‌లో చేపలు కొనుగోలు చేయడం చాలామందికి అలవాటు. నేరుగా బోటు వద్దకు వెళ్లి తాజా చేపలు కొనుగోలు చేయాలని కోరుకుంటారు. మత్స్య శాఖ అధికారులు నిర్మించిన ఆధునిక భవనంలో విద్యుత్ వెలుగులు లేకపోవటం, చేపలు శుభ్రం చేసేందుకు నీటివసతిని అందించ లేకపోవటం ప్రధాన కారణం. అంతేకాకుండా ఫిషింగ్ హార్బర్‌లో చేపలు కొనుగోలు చేయటానికి వచ్చే వారికి మార్కెట్ కేంద్రం ఎక్కడో తెలియజేయలేకపోవటం ప్రధాన లోపం. దీనితో చేపల కొనుగోలుకు వచ్చే వినియోగదారులు నేరుగా ఫిషింగ్ హార్బర్ లోపలకు వెళ్లిపోతున్నారు. చేపల మార్కెట్ భవనం వినియోగానికి అవసరమైన వసతులు కల్పించి మత్స్యకారుల వ్యాపారానికి అనుమతించాలని పలువురు సూచిస్తున్నారు.

కనక మహాలక్ష్మికి బంగారు గొలుసు బహూకరణ



అమ్మవారి అష్టదళ పద్మారాధన సేవలో ప్రముఖులు

జగదాంబ కూడలి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి తుమ్మిడి బ్రదర్స్ అధినేత రామ్‌కుమార్ కుటుంబ సభ్యులు మంగళవారం బంగారు గొలుసు(నెక్లెస్)ను ఆలయ మండపంలో అందజేశారు. 16.945 గ్రాముల బంగారంతో దీన్ని తయారు చేసి సమర్పించారని జేఈవో తిరుమలేశ్వరరావు తెలిపారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం ఆలయంలో పూజలు జరిపి తీర్థ ప్రసాదాలు అందజేశామన్నారు. కనకమహాలక్ష్మి అమ్మవారిని స్వర్ణపుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శన అవకాశం కల్పించారు. అష్టదళ పద్మారాధన సేవలు నిర్వహించారు.

మార్గశిర ఉత్సవాల్లో సేవలందించిన ఆలయ పండితులు, అర్చకులు, సేవకులను అధికారులు అభినందించారు. అన్నదాన భవనంలో అభినందన సభ నిర్వహించారు. భక్తులకు విశిష్ట సేవలు అందజేసిన వారిని అధికారులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరు రమణ, సూర్యనారాయణ మూర్తి, కె.సూర్యారావు, ఎంవీరమణ, టి.తిరుపతిరావు, వేదపండితులు ఎంబీఎస్ శాస్త్రి, ప్రధాన అర్చకుడు కె.శ్రీనివాస శర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఆలయ జేఈవో తిరుమలేశ్వరరావుకు గొలుసు అందజేస్తున్న తుమ్మిడి బ్రదర్స్ అధినేత రామ్‌కుమార్ కుటుంబ సభ్యులు

12న ఘంటసాల పాటల పోటీలు



పాటల పోటీల పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ తదితరులు

డాబాగార్డెన్స్ జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల ది గ్రేట్ సినిమా త్వరలో విడుదల కానున్న సందర్భంగా ఈ నెల 12న నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఘంటసాల పాటల పోటీల్లో గాయనీగాయకులు పాల్గొనాలని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కోరారు. విశ్రాంత పోలీసు అధికారి సీహెచ్ రామారావు దర్శకత్వం వహించిన అమర గాయకుడు ఘంటసాల బయోపిక్ వచ్చే నెలలో విడుదల కానున్న సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే వంశీకృష్ణ మంగళవారం సాయంత్రం విడుదల చేశారు. అనంతరం ఘంటసాల గానావధాని డా.రెహమతుల్లా మాట్లాడుతూ ఈ నెల 12న ఉదయం 9 నుంచి విశాఖ పౌరగ్రంథాలయంలో స్త్రీ, పురుషులకు వేర్వేరుగా పోటీలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. పురుషులు ఘంటసాల సోలోస్, మహిళలు ఘంటసాల స్వరపరచిన చిత్రాల్లోని సోలోస్ మాత్రమే పాడాలని షరతు విధించారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలుగా విభజించి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ, ప్రోత్సాహక బహుమతులు ఉంటాయన్నారు. గాయకులు 83415 32799, 72075 32799 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హరిప్రసాద్, శ్రీనివాస్, రాజేష్ పాల్గొన్నారు.

దువ్వాడ మీదుగా సంక్రాంతి ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి ప్రయాణికుల సౌకర్యార్థం దువ్వాడ మీదుగా కాచిగూడ-శ్రీకాకుళం రోడ్డు, చెర్లపల్లి-శ్రీకాకుళం రోడ్డు మధ్య ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

కాచిగూడ-శ్రీకాకుళం రోడ్డు-కాచిగూడ

07615 నంబరు గల ప్రత్యేక రైలు ఈ నెల 11, 15 తేదీల్లో సాయంత్రం 5.45 గంటలకు కాచిగూడలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5.45 గంటలకు దువ్వాడ, 9 గంటలకు శ్రీకాకుళం రోడ్డు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07616 నంబరు గల ప్రత్యేక రైలు ఈ నెల 12, 16 తేదీల్లో మధ్యాహ్నం 2.45 గంటలకు శ్రీకాకుళం రోడ్డులో బయలుదేరి సాయంత్రం 5.10 గంటలకు దువ్వాడ, మరుసటి రోజు ఉదయం 7.35 గంటలకు కాచిగూడ చేరుతుంది.

చెర్లపల్లి-శ్రీకాకుళం రోడ్డు-చెర్లపల్లి

07617 నంబరు గల ప్రత్యేక రైలు ఈ నెల 8న రాత్రి 7.20 గంటలకు చెర్లపల్లిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5.45 గంటలకు దువ్వాడ, 9 గంటలకు శ్రీకాకుళం రోడ్డు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07617 నంబరు గల రైలు ఈ నెల 9న మధ్యాహ్నం 2.45 గంటలకు శ్రీకాకుళం రోడ్డులో బయలుదేరి సాయంత్రం 5.10 గంటలకు దవ్వాడ, మరుసటి రోజు ఉదయం 6.30 గంటలకు చెర్లపల్లి చేరుతుంది.

వీఎంఆర్‌డీఏ సెక్రటరీగా మురళీకృష్ణ

... 5వ పేజీ తరువాయి

సెక్రటరీ, ఎస్టేట్ అధికారి పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం భర్తీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక వార్షిక బదిలీల్లో భాగంగా వీఎంఆర్‌డీఏ సెక్రటరీ కీర్తిని విజయనగరం జిల్లా ఆర్‌డీఓగా బదిలీ చేసింది. ఇప్పుడు ఆ స్థానంలో డిప్యూటీ కలెక్టర్ పి.మురళీకృష్ణను నియమించింది. అలాగే ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డిని గతంలో అమరావతికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో డిప్యూటీ కలెక్టర్ బి.దయానిధిని నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

నేటి నుంచి ఏపీ డిజిటల్ టెక్నాలజీ సదస్సు

... 5వ పేజీ తరువాయి

నారా లోకేశ్ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా సహకారం అందిస్తున్న ఈ సదస్సులో ఐటీ, ఐటీఈఎస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్, ఎలక్ట్రానిక్స్, స్మార్ట్ అండ్ సస్టెయినబుల్ టెక్నాలజీ, మెడికల్ అండ్ హెల్త్ టెక్నాలజీ, క్రియేటివ్ టెక్నాలజీలపై చర్చలు జరుగుతాయని ఏపీ డిజిటల్ టెక్నాలజీ ఇండస్ట్రీ లీడర్‌షిప్ ఫోరమ్ కన్వీనర్ శ్రీధర్ కొసరాజు తెలిపారు.

ప్రధాని పర్యటనకు సర్వం సిద్ధం

... 5వ పేజీ తరువాయి

జనాలకు తరలిస్తున్నారు. ఇందుకు సుమారు ఏడు వేల వాహనాలను వినియోగిస్తున్నారు. పొరుగు జిల్లాల నుంచి వాహనాలు బుధవారం ఉదయమే బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకల్లా సభా ప్రాంగణానికి చేరుకునేలా ఏర్పాట్లుచేశారు.

మూడు బ్లాక్‌లు

ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో రెండు వేదికలు ఏర్పాటుచేశారు. ఒకటి ప్రధాన వేదిక. ప్రధాని, ఇతర ప్రముఖులు ఆసీనులయ్యేలా భారీగా రూపొందించారు. మరొకటి సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన కోసం ఏర్పాటుచేశారు. ప్రాంగణంలో మూడు బ్లాక్‌లు నిర్మించారు. ప్రధాని, ఇతరులు కూర్చునే వేదికకు ఎదురుగా ఒక బ్లాక్, దానికి ఇరువైపులా రెండు ఏర్పాటుచేశారు. జనాల కోసం 27 గ్యాలరీలు ఏర్పాటుచేసి ఒక్కొక్క దానిలో రెండు వేలకుపైగా కుర్చీలు వేశారు. ప్రముఖుల కోసం మరో ఆరు గ్యాలరీలు కేటాయించారు. మంత్రుల కోసం ఒక గ్యాలరీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లకు ఒక గ్యాలరీ, కూటమి పార్టీలకు చెందిన నేతలకు మరో రెండు గ్యాలరీలు, అధికారులకు ఒకటి, ఎన్టీపీసీ అధికారులకు ఒక గ్యాలరీ కేటాయించారు. ప్రతి గ్యాలరీకి ఒక జిల్లా అధికారిని ఇన్‌చార్జిగా నియమించారు. ప్రతి గ్యాలరీలో ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటుచేశారు. గ్యాలరీలో ఉన్న వారికి తాగునీరు అందించనున్నారు. మైదానం బయట బయో టాయ్‌లెట్లు అందుబాటులో ఉంచారు.

ఆరుబయట కూడా ఎల్‌ఈడీ స్ర్కీన్లు

ప్రధాన మైదానానికి ఎదురుగా ఉన్న మరో మైదానంలో 15 వేల మంది కూర్చునేలా టెంట్ వేసి కుర్చీలు ఏర్పాటుచేశారు. అయితే గ్యాలరీలు నిండిన తరువాత రెండో మైదానంలో కూర్చో బెడతారు. ఆ తరువాత వచ్చిన వారు బ్లాకులు బయట నిల్చుని ప్రధానమంత్రి ప్రసంగం వినేందుకు అనువుగా ఆరుబయట ఎల్‌ఈడీలు అమర్చారు.

వేదిక వరకూ రోడ్‌షో

ప్రధాన మోదీ ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డు మార్గాన తాటిచెట్లపాలెం జంక్షన్, ఫ్లైఓవర్, దత్ ఐలాండ్ మీదుగా వెంకటాద్రి వంటిల్లు వద్దకు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్‌షోలో పాల్గొంటారు. రోడ్‌షో ప్రారంభం నుంచి వేదికపైకి వెళ్లేంత వరకూ జనాలు స్వాగతం పలికేలా రూట్ మ్యాప్ రూపొందించారు. బుధవారం సాయంత్రం 6.50 గంటల వరకూ సభ జరగనున్నందున ఫ్లడ్ లైట్లు ఏర్పాటుచేశారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మంత్రులు, కూటమి పార్టీల నేతలు, అధికారులు పలు దఫాలు మైదానానికి వచ్చి ఏర్పాట్లు పర్యవేక్షించారు. పోలీసుల కనుసన్నల్లో ఈ ఏర్పాట్లు జరిగాయి.

నైపుణ్య గణనకు సన్నాహాలు

... 5వ పేజీ తరువాయి

చేపట్టనున్నారు. మొదటిది సచివాలయ సిబ్బంది తమ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి 15 నుంచి 59 ఏళ్లలోపు వయసున్న వారి వివరాలను సేకరిస్తారు. చదువు (విద్యార్హత), ఉద్యోగం, జీతం, ఎటువంటి నైపుణ్యాలు కావాలనుకుంటున్నారు, ఇతర ఉద్యోగాలకు వెళ్లాలన్న ఆలోచన ఉంటే వాటి వివరాలను సేకరిస్తారు. రెండోది సెల్ఫ్ ఎన్యూమరేషన్. ఇందులో ఎవరికి వారే తమ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు అవకాశం ఉంటుంది. ఈ మేరకు నైపుణ్య అనే యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తోంది. స్కిల్ సెన్సస్ ప్రారంభమైన తరువాత ఈ యాప్ పనిచేస్తుందని అధికారులు చెబుతున్నారు. నైపుణ్య గణన ద్వారా సేకరించిన సమాచారాన్ని మదింపు చేసిన తరువాత కేటగిరీలుగా విభజిస్తారు. ఇంటర్, డిగ్రీ, ఇతర ఉన్నత కోర్సులు పూర్తిచేసిన వారి జాబితా, పదో తరగతి కంటే తక్కువ చదువుకున్న వారి జాబితా, పూర్తిగా చదువుకోని వారి జాబితాను తయారుచేస్తారు. అర్హతకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇప్పటికే ఉద్యోగాలు చేస్తున్న వారికి మెరుగైన అవకాశాలు దక్కించుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటుంది. ఇటువంటి శిక్షణకు ఉద్యోగం చేస్తున్న అభ్యర్థులు ఆసక్తి చూపుతారా?, లేదా? అనేది కూడా గణనలోనే గుర్తిస్తారు. రానున్న రోజుల్లో ఉద్యోగావకాశాలకు కేంద్ర బిందువుగా మారనున్న ఏఐ, డ్రోన్ టెక్నాలజీ, ఇతర సాంకేతిక అంశాల్లో శిక్షణకు ముందుకువచ్చే వారి కోసం ప్రత్యేక సంస్థలతో ప్రభుత్వం ఒప్పందం చేసుకోనున్నది.

నేడు ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎం రాక

... 5వ పేజీ తరువాయి

చేరుకుని...ప్రధానికి వీడ్కోలు పలికి, రాత్రి 7.30 గంటలకు విమానంలో విజయవాడ వెళతారు. కాగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మధ్యాహ్నం 12 గంటలకు విశాఖ చేరుకుని నోవాటెల్‌కు వెళతారు. అక్కడ విశ్రాంతి తీసుకుని సాయంత్రం 4 గంటలకు ఐఎన్ఎస్ డేగాకు వెళతారు. ప్రధానికి స్వాగతం పలికి ఆయనతో పాటు రోడ్‌షో, బహిరంగ సభలో పాల్గొంటారు. తరువాత తిరిగి విజయవాడ వెళతారు.

నో బెర్త్

... 5వ పేజీ తరువాయి

(18046), ఫలక్‌నుమా (12704) వంటి రెగ్యులర్ రైళ్లలో దాదాపు ఈ నెలాఖరు వరకూ బెర్తులు అయిపోయి, నిరీక్షణ జాబితా ఉంది. అలాగే చెన్నై వెళ్లే కోరమండల్ ఎక్స్‌ప్రెస్ (12841), మెయిల్ (12839), బొకారో ఎక్స్‌ప్రెస్ (13351) వంటి రెగ్యులర్ రైళ్లతోపాటు బై వీక్లీ, వారాంతపు రైళ్లకు ఈ నెల 26 వరకు బెర్తులు లభించే పరిస్థితి లేదు. ఇక బెంగళూరు చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్లే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18463), హౌరా-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12863) వంటి డైలీ రైళ్లతోపాటు బై వీక్లీ, వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు తీవ్ర డిమాండ్ ఏర్పడి నెలాఖరు వరకు బెర్తులు నిండిపోయి నిరీక్షణ జాబితా కనిపిస్తోంది. సంక్రాంతి ప్రయాణం భారంగా భావిస్తున్నారు.

నగరం పోలీస్ మయం



... 5వ పేజీ తరువాయి

మైదానంతోపాటు మద్దిలపాలెం, పిఠాపురం కాలనీ, వీఐపీ రోడ్డు, రేసపువానిపాలెం, ఏయూ ఇంజనీరింగ్ హాస్టళ్ల భవనాలు చుట్టుపక్కల బాంబ్ స్క్వాడ్‌లు, ఎన్ఎస్‌జీ బృందాలు విస్తృతంగా తనిఖీ చేస్తున్నాయి. ప్రధాని సభకు జనాలను తీసుకువచ్చే బస్సులు మద్దిలపాలెం డిపోలోకి వెళ్లడానికి బస్టాండ్ ఎదురుగా జాతీయ రహదారిపై డివైడర్‌ను తొలగించారు. అలాగే ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ ఆర్చ్ ద్వారా వీవీఐపీ వాహనాలు రాకపోకలు సులభంగా సాగేందుకు జాతీయ రహదారి, బీఆర్‌టీఎస్ రోడ్డుపై ఉన్న డివైడర్లను కూడా తొలగించారు. ఆ ప్రాంతాన్ని పూర్తిగా పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఏయూ ఇంజనీరింగ్ మైదానంలోకి జనాలు, వాహనాలు సులభంగా ప్రవేశించేందుకు వీలుగా పిఠాపురం కాలనీ వైపు రెండుచోట్ల ఏయూ మైదానం ప్రహరీ గోడను తొలగించారు. అదేవిధంగా ప్రధాని ఎయిర్‌పోర్టు నుంచి ఎన్ఏడీ జంక్షన్, తాటిచెట్లపాలెం, తెలుగుతల్లి ఫ్లైఓవర్ మీదుగా దత్ ఐలాండ్‌కు చేరుకుంటారు కాబట్టి ఆమార్గంలో బాంబ్‌స్క్వాడ్, ఎన్ఎస్‌జీ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేశాయి. ప్రతి వంద అడుగులకు ఒకరు చొప్పున పోలీస్ బీట్‌లు ఏర్పాటుచేశారు.

ప్రధాని పర్యటన కోసం పకడ్బందీగా ఏర్పాట్లు



భద్రతా ఏర్పాట్లపై సిబ్బందికి సూచలిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు

మద్దిలపాలెం, జనవరి7 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నగరానికి బుధవారం వస్తున్న నేపథ్యంలో మద్దిల పాలెం కూడలిలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మద్దిలపాలెం కూడలి మీదుగా ఏయూ మైదానంలోకి ప్రవేశమార్గం ఉన్నందున అక్కడ రోడ్ల పరిస్థితి పరిశీలించారు. బుధవారం సాయంత్రం ప్రధానమంత్రి మోదీ సభ సందర్భంగా ఆయా రోడ్లులపై ట్రాఫిక్ పరమైన అంశాలను చర్చించారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన పోలీస్ ఉన్నతాధికారులు స్థానిక ట్రాఫిక్ పోలీసులతో మాట్లాడి ట్రాఫిక్ సమస్యలు లేకుండా ఉండేందుకు పరిష్కార మార్గాలపై మాట్లాడారు. సమీప జిల్లాల నుంచి బస్సులు, అధికారుల వాహనాలు మద్దిలపాలెం కూడలి మీదుగా రానుండడంతో రద్దీ లేకుండా ఉండేందుకు పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. విశాలమైన రోడ్లు ఉన్నప్పటికీ మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేయడం వల్ల వాహనా రాకపోకలకు ఇబ్బందులు ఉంటాయని గుర్తించారు. కూడలి నుంచి పీతాపురం కాలనీ, ఏయూ మైదానం లోపలకు వెళ్లే మార్గాల్లో కొన్ని చోట్ల డివైడర్లను తొలగించారు. అలాగే సాయిరాం హోటల్ ఎదురుగా జాతీయ రహదారిని తాత్కాలికంగా ఓపెన్ చేశారు. దీనవల్ల సభ ముగిసిన తర్వాత అధికారుల వాహనాలు, బస్సులు అక్కడ యూటర్న్ తీసుకునేందుకు వెసులుబాటు కల్పించారు. అయితే ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు స్థానిక వాహనాలకు మద్దిలపాలెం జాతీయ రహదారిలోకి ప్రవేశం లేకుండా ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణం చేయాల్సి ఉంటుంది.



పీతాపురం కాలనీలో రోడ్డు వైపు తొలగించిన డివైడరు, పర్యవేక్షణలో పోలీసులు



ప్రధాని సభకు వచ్చే వారికి అందించేందుకు సిద్ధం చేసిన వాటర్ క్యాన్లు

ప్రధాని సభకు
'తూర్పు' నుంచి 30 వేల మంది

- ఎమ్మెల్యే వెలగపూడి ఆధ్వర్యంలో జన సమీకరణకు ఏర్పాట్లు
- నేత్ర వైద్యశాల, బాస్కెట్ బాల్ గ్రౌండ్‌లో పార్కింగ్
- మధ్యాహ్నం 2 గంటలకు ఎడమవైపు గ్యాలరీలోకి ప్రవేశం
- ఆహారం, వాటర్ ప్యాకెట్లు ఏర్పాటు

మద్దిలపాలెం, జనవరి7 (ఆంధ్రజ్యోతి) : ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో బుధవారం సాయంత్రం నిర్వహించే ప్రధానమంత్రి మోదీ సభకు తూర్పు నియోజకవర్గం నుంచి 25 వేల నుంచి 30 వేల జనాబా సమీకరించారు. స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు నియోజకవర్గంలోని వార్డుల నుంచి జన సమీకరణపై కూటమి కార్పొరేటర్లు, ఇన్‌చార్జులకు దిశనిర్దేశం చేశారు. తూర్పు నియోజకవర్గ పరిధిలో 9, 10, 11, 12, 13, 15, 16, 17, 18, 19, 20, 21, 22, 23 వ వార్డులు ఉన్నాయి. ఆయా వార్డుల నుంచి వార్డు పరిధిని బట్టి వెయ్యి నుంచి 4 వేల మంది వరకు జనాబా సమీకరిస్తున్నారు. వారికి అవసరమైన ప్రయాణ సౌకర్యానికి వాహనాలను ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం భోజనం, తాగు నీరు సదుపాయాలు కల్పిస్తున్నారు. ఆరిలోవ ప్రాంతానికి చెందిన వార్డుల జనాబా తరలించే వాహనాలను త్రీటౌన్ పోలీస్ స్టేషన్ దరి ఉన్న బాస్కెట్ బాల్ గ్రౌండ్‌లో పార్కింగ్‌కు నిర్ణయించారు. 17, 20, 21, 22, 23వ వార్డుల వాహనాలను విశాఖ నేత్ర వైద్యశాల వద్ద పార్కింగ్ చేయాలి. పార్కింగ్ చేసిన ప్రాంతం నుంచి కాలిబాటన మోదీ రోడ్డు షో ప్రారంభించే వెంకటాద్రి వంటిల్లు వరకు చేరుకోవాలి. సిరిపురం నుంచి త్రీటౌన్ వైపు వచ్చే రోడ్డు ఎడమ వైపు గ్యాలరీలో తూర్పు నియోజకవర్గం ప్రజలకు కేటాయించారు.

మధ్యాహ్నం 2 గంటలకు గ్యాలరీ లోపలకు ప్రవేశం కల్పిస్తారు. రోడ్డు షో ప్రారంభమయ్యే వరకు ప్రజలకు అసహనం కలగకుండా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జనాలకు వాహనాల్లోనే భోజనాలు పెట్టి సభకు తీసుకుని వెళ్లేందుకు కూటమి నాయకులు చర్యలు తీసుకుంటున్నారు. రోడ్డు షో గ్యాలరీల్లో దాహార్తిని తీర్చేందుకు వాటర్ ప్యాకెట్లు అందుబాటులో పెడుతున్నారు.

ఏయూ జేఎంసీ బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా రామకృష్ణ



వెంకోజీపాలెం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఏయూ జర్నలిజం మాస్ కమ్యూనికేషన్ బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా సీనియర్ ప్రొఫెసర్ చల్లా రామకృష్ణ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన ఏయూ మీడియా రిలేషన్స్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయన పర్యవేక్షణలో ఇప్పటికి 24 మంది డాక్టరేట్లు పొందారు. అమెరికాలోని సొసైటీ ఆఫ్ ప్రొఫెషనల్ జర్నలిస్టుల సంస్థ సభ్యుడిగా, కామన్వెల్త్ యూనివర్సిటీస్, పీఆర్ కమ్యూనికేషన్స్ నెట్‌వర్క్ సభ్యుడిగా, వైజాగ్ జర్నలిస్టుల ఫోరమ్ వ్యవస్థాపక సభ్యుడిగా వ్యవహరిస్తున్నారు.పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా వైజాగ్ చాప్టర్ చైర్మన్, ఆర్ట్స్ కాలేజీ అసిస్టెంట్ ప్రిన్సిపాల్, ఏయూ జర్నలిజం విభాగాధిపతిగా బాధ్యతలు నిర్వహించారు. అమెరికా, కెనడా, ఫ్రాన్స్, స్వీడన్ దేశాలలో అనేక అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని పరిశోధనా పత్రాలు సమర్పించారు. ఇరవైకి పైగా పుస్తకాలు, అరవైకి పైగా పరిశోధనా పత్రాలను ప్రచురించారు.

ప్రధాని సభకు తరలిరండి : వీఎంఆర్డీఏ చైర్మన్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రణవ్‌గోపాల్, పాల్గొన్న ఎమ్మెల్సీ రామారావు, జనసేన నేత ఉషాకిరణ్, బీజేపీ నేత శ్యామలాదీపిక, శ్రీనివాసరావు తదితరులు

సిరిపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభకు పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ పిలుపునిచ్చారు. మంగళవారం వీఎంఆర్డీఏ భవన్‌లో కూటమి పార్టీల నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్తర నియోజకవర్గం నుంచి సభకు 25 వేల మందికి పైగా ప్రధాని సభకు తరలిరానున్నారని తెలిపారు. ప్రధాన మంత్రి మోదీ రోడ్ షో, సభను విజయవంతం చేయాలన్నారు. వార్డు స్థాయి నుంచి జనసమీకరణ చేపట్టాలని సూచించారు.

సమావేశంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ పసుపులేటి ఉషా కిరణ్, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కుమార్తె శ్యామలాదీపిక, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర స్థాయి నాయకులు, కార్పొరేటర్లు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రధాని సభ విజయవంతం చేయాలి

వెంకోజీపాలెం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బుధవారం సాయంత్రం జరుగనున్న దేశ ప్రధాని నరేంద్ర మోదీ సభను విజయవంతం చేయాలని టీడీపీ 15వ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ పిలుపునిచ్చారు. సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలోనున్న పార్టీ వార్డు కార్యాలయంలో నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనసమీకరణకు నేతలు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. మహిళలు అధికంగా హాజరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సభకు వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు ఎదురవకుండా నాయకులు తగు జాగ్రత్త వహించాలని కోరారు. సమావేశంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, నాయకులు అప్పారి వెంకటగిరిబాబు, కర్రి గౌరీ, వరలక్ష్మి, బోను శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు బోసియా పోటీలు

- జాతీయ బోసియా స్పోర్ట్స్ ఫెడరేషన్ సెక్రటరీ జనరల్ షమిందర్ సింగ్ ఢిల్లన్

గాజువాక, జనవరి 7: దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడమే ధ్యేయంగా ఈ నెల పదో తేదీ నుంచి జాతీయ స్థాయి బోసియా పోటీలను విశాఖ మెడ్‌టెక్‌లో నిర్వహిస్తున్నట్టు జాతీయ బోసియా స్పోర్ట్స్ ఫెడరేషన్ సెక్రటరీ జనరల్ షమిందర్ సింగ్ ఢిల్లన్ పేర్కొన్నారు. మెడ్‌టెక్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన 103 మంది దివ్యాంగులు పాల్గొంటున్నట్టు తెలిపారు. ఈ పోటీల నిర్వహణకు ప్రాంగణంతో పాటు అన్ని రకాల సహాయ సహకారాలను మెడ్‌టెక్ అందిస్తున్నట్టు తెలిపారు. మెడ్‌టెక్ జోన్ అసిస్టెంట్ టెక్నాలజీ హెడ్ అమిత్‌కుమార్ శర్మ మాట్లాడుతూ క్రీడారంగానికి మెడ్‌టెక్ సంస్థ సంపూర్ణ సహకారాన్ని అందిస్తుందన్నారు. మెడ్‌టెక్ జోన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా క్రీడారంగంలో ప్రోత్సహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర పారా బోసియా స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సురవరపు రామన్ సుబ్బారావు మాట్లాడుతూ వీల్‌చైర్‌కే పరిమితమై ఇళ్లల్లో కదల్లేని స్థితిలో ఉన్న దివ్యాంగుల్లో మనోధైర్యాన్ని నింపేందుకు ఇటువంటి పోటీలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు రుక్మాకరరావు, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో షమిందర్ సింగ్ ఢిల్లన్, తదితరులు

వేంకటేశ్వర ఆలయంలో ధనుర్మాస ప్రత్యేక పూజలు



ఎంవీపీ కాలనీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరులోని శ్రీ వేంకటేశ్వర స్వామి, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామున తిరుప్పల్లాండు వినిపించారు. తిరుప్పావై పూజలు చేశారు. పాశురాలు పఠించారు.

అనంతరం స్వామిని వివిధ రకాల పరిమళ పుష్పాలతో అలంకరించి సుందరంగా తీర్చిదిద్దారు. ఆంజనేయస్వామిని మొక్కజొన్న పొత్తులతో అలంకరించారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. భక్తులు దర్శించుకున్నారు.

సినిమా గైడ్

- **బచ్చలమల్లి :** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)
- **విడుదల-2 :** శ్రీకన్య, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని(గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **యువి :** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)
- **ముఫాసా:** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **పుష్ప-2 :** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 35, టమాటా 14, వంకాయలు (తెలుపు)34, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 46, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 40, బీరకాయలు 50, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 18, క్యారెట్ 46 దొండకాయలు 44, బంగాళదుంపలు 27, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది)50, బరబాటి 44, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 34 దోస కాయలు 36, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 50, పొటల్స్ 60, కీర దోస 34, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 46, చిలగడ దుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 44, కొండఉసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	510
విజయనగరం	514
శ్రీకాకుళం	514

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	102
లైవ్ ధర	122
విత్ స్కిన్	214
స్కిన్‌లెస్	224

సందడిగా సంక్రాంతి సంబరాలు



విశాఖ వేలీ పాఠశాలలో వివిధ వేషధారణలో అలరించిన విద్యార్థులు, సోది చెబుతున్న ఓ విద్యార్థిని, పక్కనే హరిదాసుల ఆటపాటలు

ఆరిలోవ. జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : విశాఖవేలీ ప్రాంగణంలో మంగళవారం సంప్రదాయబద్ధంగా సంకాంత్రి సంబరాలను నిర్వహించారు. విద్యార్థులు పండుగ వాతావరణం ఉట్టిపడేలా సంప్రదాయ దుస్తులు ధరించి అలరించారు. హెచ్ఎం ఈశ్వరీప్రభాకర్ పలువురు చిన్నారులకు భోగిపండ్లను నెత్తిన పోసి అలరించారు. కట్టెల పొయ్యిపై కొత్త బియ్యంతో పొంగలి వండారు. పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు హరిదాసు, సోదమ్మ, పిట్టలదొర వేషాలు, గంగిరెద్దుల ఆటల వేషధారణలో అలరించారు. గాలిపటాలను ఎగురు వేసి ఆనందంగా గడిపారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన బొమ్మలకొలవు ప్రత్యేకంగా నిలిచింది. సంప్రదాయక పిండి వంటలను రుచి చూశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున విద్యార్థులు, అధిక సంఖ్యలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీలో..

ఎంవీపీ కాలనీ : స్థానిక శ్రీసత్యసాయి విద్యా విహార్ ప్రాంగణంలో మంగళవారం సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. తెలుగు సంస్కృతీసంప్రదాయాలు ఉట్టిపడేలా చిన్నారులు వివిధ ప్రదర్శనలతో అలరించారు. పల్లె వాతావరణాన్ని ప్రతిబింబించేలా సెట్టింగులు వేశారు. బొమ్మల కొలువు, చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎడ్ల పందాలు, రంగవల్లికలు, హరిదాసుల వేషధారణ, ముత్తయిదువుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. బొమ్మల కొలువు, భోగి మంటలు, పొంగలి వండటంతో పాటు రకరకాల పిండి వంటలను ప్రదర్శించారు. సంక్రాంతి విశిష్టతను తెలియజేసే విద్యార్థుల నృత్యనాటికలు ఆకట్టుకున్నాయి. శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్, ప్రశాంతి నిలయం అడ్మిన్ అధికారి ఎస్‌జీ చలం, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది వేడుకల్లో పాల్గొన్నారు.



చిన్నారులకు భోగిపండ్లు పోస్తున్న ఉపాధ్యాయులు, బొమ్మల కొలువు, గాలిపటాలు, ఎండ్లబండితో వేసిన సెట్

స్వర్ణపుష్పాలంకరణలో భక్తులకు అమ్మవారు దర్శనం

- మార్గశిర ఉత్సవాల్లో సేవలందించిన వారికి సత్కారాలు, కనకమహాలక్ష్మికి బంగారు నెక్లెస్ అందజేత



జేఈవో తిరుమలేశ్వరరావుకు బంగారు గొలుసును అందజేస్తున్న తుమ్మిడి బ్రదర్స్ అధినేత రామ్‌కుమార్

జగదాంబ కూడలి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి తుమ్మిడి బ్రదర్స్ అధినేత రామ్‌కుమార్ కుటుంబ సభ్యులు మంగళవారం బంగారు గొలుసు(నెక్లెస్)ను ఆలయ మండపంలో అందజేశారు. 16.945 గ్రాముల బంగారంతో దీన్ని తయారు చేసి సమర్పించారని జేఈవో తిరుమలేశ్వరరావు తెలిపారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం ఆలయంలో పూజలు జరిపి తీర్థ ప్రసాదాలు అందజేశామన్నారు.

స్వర్ణపుష్పాలతో అమ్మవారి దర్శనం: కనకమహాలక్ష్మి అమ్మవారిని స్వర్ణపుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శన అవకాశం కల్పించారు. అష్టదళపద్మారాధన సేవలు నిర్వహించారు.

అభినందనలు: మార్గశిర ఉత్సవాల్లో సేవలందించిన ఆలయ పండితులు, అర్చకులు, సేవకులను ఆలయ అధికారులు అభినందించారు. అన్నదాన భవనంలో అభినందన సభ నిర్వహించారు. భక్తులకు విశిష్ట సేవలు అందజేసిన వారిని అధికారులు కొనియాడారు. కార్యక్రమంలో ఇంజనీరు రమణ, సూర్యనారాయణ మూర్తి, కె.సూర్యారావు, ఎంవీ రమణ, టి.తిరుపతిరావు, వేదపండితులు ఎంబీఎస్ శాస్త్రి, ప్రధాన అర్చకుడు కె.శ్రీనివాస శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఈవో బండారు ప్రసాద్, సన్యాసిరావు

వెంకోజీపాలెం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) :ఎంఎంటీసీ కాలనీలోని త్రిమూర్తిక వేంకటేశ్వరస్వామి చిత్రపటంతో కూడిన 2025 సంవత్సరం క్యాలెండర్‌ను కొత్త వెంకోజీపాలెం శ్రీ గౌరీ జ్ఞానలింగేశ్వరాలయం దేవస్థానం, మురళీనగర్ శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఈవో బండారు ప్రసాద్ మంగళవారం ఆవిష్కరించారు. త్రిమూర్తిక వేంకటేశ్వర స్వామి ఆలయం మేనేజరు బి.సన్యాసిరావు రూపొందించిన ఈ క్యాలెండర్ ఎంతో బాగుందని ఈవో పేర్కొన్నారు.

దువ్వాడ మీదుగా సంక్రాంతి ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి ప్రయాణికుల సౌకర్యార్థం దువ్వాడ మీదుగా కాచిగూడ-శ్రీకాకుళం రోడ్డు, చెర్లపల్లి-శ్రీకాకుళం రోడ్డు మధ్య ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

కాచిగూడ-శ్రీకాకుళం రోడ్డు-కాచిగూడ

07615 నంబరు గల ప్రత్యేక రైలు ఈ నెల 11, 15 తేదీల్లో సాయంత్రం 5.45 గంటలకు కాచిగూడలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5.45 గంటలకు దువ్వాడ, 9 గంటలకు శ్రీకాకుళం రోడ్డు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07616 నంబరు గల ప్రత్యేక రైలు ఈ నెల 12, 16 తేదీల్లో మధ్యాహ్నం 2.45 గంటలకు శ్రీకాకుళం రోడ్డులో బయలుదేరి సాయంత్రం 5.10 గంటలకు దువ్వాడ, మరుసటి రోజు ఉదయం 7.35 గంటలకు కాచిగూడ చేరుతుంది.

చెర్లపల్లి-శ్రీకాకుళం రోడ్డు-చెర్లపల్లి

07617 నంబరు గల ప్రత్యేక రైలుఈ నెల 8నరాత్రి 7.20 గంటలకు చెర్లపల్లిలో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 5.45 గంటలకు దువ్వాడ, 9 గంటలకు శ్రీకాకుళం రోడ్డు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07617 నంబరు గల రైలు 9న మధ్యాహ్నం 2.45 గంటలకు శ్రీకాకుళం రోడ్డు లో బయలుదేరి సాయంత్రం 5.10 గంటలకు దవ్వాడ, మరుసటి రోజు ఉదయం 6.30 గంటలకు చెర్లపల్లి చేరుతుంది.

నగరానికి చేరిన ఫణికుమార్ మృతదేహం

పెదగంట్యాడ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యనభ్యసించేందుకు కెనడా వెళ్లి అక్కడ అనుమానాస్పదంగా మృతి చెందిన ఫణికుమార్ మృతదేహాన్ని సోమవారం రాత్రి నగరానికి తీసుకువచ్చారు. మృతుని కుటుంబీకులు ఫణికుమార్ మృతదేహాన్ని చట్టివానిపాలెం తరలించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మంగళవారం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.మృతుని తండ్రి పిల్లి నాగప్రసాద్, ఇతర కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఫణికుమార్ మృతదేహాన్ని కెనడా నుంచి ఇక్కడకు తీసుకురావడానికి పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ శ్రీభరత్ ఎంతో కృషి చేశారని వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఫణికుమార్ కుటుంబ సభ్యులను తాము అండగా ఉంటామని పల్లా పేర్కొన్నారు. అనంతరం ఫణికుమార్ మృతదేహాన్ని చట్టివానిపాలెంలోని శ్మశానవాటికకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

ఉత్తరాంధ్రను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలి

ఎంవీపీ కాలనీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని ఉత్తరాంధ్ర పరిరక్షణ సమితి డిమాండ్ చేసింది. మంగళవారం ఎంవీపీ కాలనీలోని ఓ ప్రైవేటు భవనంలో విలేకరుల సమావేశంలో సమితి ప్రతినిధులు మాట్లాడుతూ ఈ ప్రాంతంపై నిర్లక్ష్యం వహిస్తే ప్రత్యేక ఉత్తరాంధ్ర రాష్ట్రం డిమాండ్ చేస్తామన్నారు. ఉత్తరాంధ్రకు బుందేల్ ఖండ్, గూర్ఖాలాండ్ తరహాలో ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని, సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి మోదీ ఈ సమస్యలపై స్పష్టమైన ప్రకటన చేయాల్సి ఉందన్నారు. సమితి అధ్యక్షుడు లగుడు గోవిందరావు, సభ్యులు సత్యం, శ్రీనివాస్, రాజ్‌కుమార్, ఈశ్వరరావు, రవికుమార్, మహేష్ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపివేయాలి

ఆరిలోవ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ నిలిపి వేస్తున్నామని, ప్లాంటుకు సొంత గనులు కేటాయిస్తున్నట్టు నగరంలో నిర్వహించే బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్కేఎస్వీ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం 10వ వార్డులోని బీఎస్ఆర్ నగర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటీకరణపై ప్రజా సంఘాలు, ఉద్యోగులు సంవత్సరాల తరబడి నిరసన చెబుతున్నా ప్రధాని మోదీ పట్టించుకోవడం లేదన్నారు. విశాఖ వస్తున్న నేపథ్యంలో ప్లాంటుపై తీపికబురు చెప్పాలని కోరారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వి.నరేంద్రకుమార్, జోన్ కమిటీ సభ్యుడు డి.నాగరాజు, స్థానిక నేతలు ఎ.రమణ, జి.నాగరాజు, మణి, సన్యాసమ్మ, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

వెంకోజీపాలెం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 16వ వార్డులో మంగళవారం టీడీపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ వార్డు అధ్యక్షుడు నారు గోపి ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు కేఆర్ఎం కాలనీలో ఇంటింటికీ వెళ్లి సభ్యత్వ నమోదు చేపట్టారు. సుమారు 150 మంది నుంచి ఈ సభ్యత్వాలు స్వీకరించారు.



ప్రధాని మోదీ రోడ్‌షో స్థలం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు తదితరులు



సభా ప్రాంగణంలో పోలీసు అధికారులకు సూచనలిస్తున్న హోం మంత్రి అనిత

ముస్తాబైన ఏయూ ప్రాంగణం

ప్రధానమంత్రి మోదీ సభకు ఏర్పాట్లు పూర్తి

» లక్షలాది మందిని తరలించేందుకు చర్యలు

» అడుగడుగునా మోహరించిన పోలీసులు

ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో బుధవారం సాయంత్రం నిర్వహించే ప్రధానమంత్రి నరేంద్రమోదీ బహిరంగ సభకు సర్వం సిద్ధమయింది. ప్రధాన వేదిక, బారికేడ్లు, ఇతర ఏర్పాట్లు పూర్తయ్యాయి. వంటిల్లు కూడలి నుంచి ప్రధాని, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పాల్గొనే రోడ్‌షోకు ట్రయల్‌రన్ నిర్వహించారు. మరోవైపు సభకు లక్షలాదిగా ప్రజలను తరలించేందుకు కూటమి నేతలు కసరత్తు చేశారు. ఈ మేరకు వేలాదిగా వాహనాలను ఏర్పాటు చేశారు. వచ్చిన వారికి ఆహార పొట్లాలు, తాగునీరు అందిస్తారు. పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



ప్రధాని మోదీ రోడ్‌షోకు సిద్ధం చేసిన వాహనం



వేదిక వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్, జనసేన ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, సుందరపు, తదితరులు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, తదితరులు



ఏర్పాట్లపై ఎస్‌పీజీ సెక్యూరిటీ అధికారులతో చర్చిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు



రోడ్‌షో ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న కూటమి జెండాలు



మద్దిలపాలెం బస్టాండ్ నుంచి రోడ్డు దాటేందుకు వీలుగా తొలగించిన డివైడర్



సభా ప్రాంగణంలో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు



సభకు హాజరయ్యే జనాల కోసం సిద్ధం చేస్తున్న పులిహోర ప్యాకెట్లు



సభా ప్రాంగణంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న పోలీసు, జిల్లా అధికారులు

ప్రధాని మోదీ సంస్కరణలతోనే దేశం అభివృద్ధి

» రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

విశాఖపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ అనేక సంస్కరణలతో దేశాన్ని అభివృద్ధి పథాన ముందుకు తీసుకువెళ్తున్నారని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. బీజేపీ కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు సమస్యను మోదీ దృష్టికి తీసుకెళ్లామని, సరైన పరిష్కారం లభిస్తుందని విశ్వాసం వ్యక్తంచేశారు. ఈ విషయంలో అనుమానాలకు తావు లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సంపద సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలంతా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ విశాఖ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, సుహాసినీ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య

నాక్ సెంటర్‌లో జాబ్‌మేళా రేపు

విశాఖపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో పెదగంట్యాడ నాక్ సెంటర్‌లో ఈ నెల తొమ్మిదో తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. నిపుణ ఇంజనీరింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్, హెటిరో ల్యాబ్స్, ఆక్సిస్ బ్యాంక్, డీ మార్ట్ పాల్గొంటాయన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ ఎలక్ట్రీషియన్, డిప్లమో ఈఈఈ, బీఎస్సీ కెమిస్ట్రీ, కంప్యూటర్స్, బీకాం కంప్యూటర్స్ పూర్తిచేసిన యువతీ, యువకులు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులు విశాఖపట్నం, నక్కపల్లిలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 7981022453 నంబరులో సంప్రదించాలన్నారు. స్పాట్ రిజిస్ట్రేషన్ ఉందని, ఆధార్, అనుసంధాన ఫోను నంబరుతో హాజరుకావాలన్నారు.

కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు వాయిదా

విశాలాక్షినగర్ జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా కైలాసగిరి రిజర్వ్ పోలీసు మైదానంలో పురుష అభ్యర్థులకు ఈ నెల 8న నిర్వహించనున్న దేహ దారుఢ్య పరీక్షలు ఈ నెల 11వ తేదీకి వాయిదా వేసినట్టు అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని అభ్యర్థులు గమనించాలని కోరారు. కాగా, పురుష అభ్యర్థులకు మంగళవారం నిర్వహించిన దేహదారుఢ్య పరీక్షల్లో 251 మంది హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎల్.మోహనరావు, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎం.శ్రావణి, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఎస్బీ, సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్‌లు టి.లక్ష్మి, టి.కళ్యాణి పాల్గొన్నారు.

నేటి ఏయూ పరీక్షలు వాయిదా

విశాఖపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో బుధవారం జరగాల్సిన డిగ్రీ, పీజీ పరీక్షలను వాయిదా వేసినట్టు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటన సందర్భంగా విద్యార్థులు ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో వాయిదా వేశామని, మరలా ఈ పరీక్షలు ఎప్పుడు నిర్వహించేదీ త్వరలో ప్రకటిస్తామని వారు తెలిపారు.

10న ఉమ్మడి జిల్లా విలువిద్య జట్టు ఎంపిక పోటీలు

విశాఖపట్నం స్పోర్ట్స్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లా జూనియర్ పురుషులు, మహిళల విలువిద్య (ఆర్చరీ) జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 10న సంస్కృతి స్కూల్‌లోని ఆర్చరీ క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్నట్టు జిల్లా విలువిద్య క్రీడాకారుల సంఘం కార్యదర్శి కె.నిశాంత్ తెలిపారు. ఇండియన్ రౌండ్, రికర్వ్, కాంపౌండ్ ఈవెంట్లలో జరిగే ఎంపిక పోటీల్లో పాల్గొనే ఆసక్తిగల క్రీడాకారులు ఉదయం 9 గంటలకు వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరు కావాలన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 23 నుంచి విజయవాడ వోల్గా అకాడమీలో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నీలో పాల్గొంటారన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఫార్మా ఉద్యోగి మృతి

గాజువాక, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఫార్మా ఉద్యోగి మృతి చెందాడు. ఈ సంఘటన చినగంట్యాడ జంక్షన్‌లో మంగళవారం జరిగింది. ఫార్మాలోని ఓ ప్రైవేటు కంపెనీలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న కునుబెల్లి రమేశ్ (24) కె.శ్రీనివాసరావు స్నేహితులు. ఇద్దరూ రోజూ చినగంట్యాడ పాయింట్‌లో కంపెనీ బస్సు ఎక్కుతారు. నాతయ్యపాలెంలో ఉంటున్న శ్రీనివాసరావు మంగళవారం జనరల్ షిఫ్ట్‌కు వెళ్లేందుకు స్కూటీపై బయలుదేరాడు. పాత గాజువాకలో రమేశ్‌ను ఎక్కించుకుని బస్ పాయింట్‌కు వస్తుండగా చినగంట్యాడ సమీపంలో వెనక నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం వీరు ప్రయాణిస్తున్న స్కూటీని ఢీకొంది. దీంతో వెనక కూర్చున్న రమేశ్ రోడ్డుపై పడిపోయాడు. అతడి తలకు తీవ్ర గాయం కావడంతో సంఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. కాగా స్కూటీని నడుపుతున్న శ్రీనివాసరావుకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న గాజువాక ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడు రమేశ్‌ది శ్రీకాకుళం జిల్లా నారాయణపురం అని తెలిపారు. స్కూటీని ఢీకొన్న వాహనాన్ని గుర్తించేందుకు సమీప ప్రాంతాల్లోని సీసీ టీవీ ఫుటేజీ పరిశీలిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



రమేశ్ మృతదేహం

రాయితో కొట్టడంతో వ్యక్తి దుర్మరణం

» మద్యం మత్తులో రూ.వంద కోసం వివాదం!

మహారాణిపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవిస్తున్న ఇద్దరు వ్యక్తులు ఆ మత్తులో వంద రూపాయల కోసం గొడవపడ్డారు. వివాదం ముదిరి కొట్లాటకు దారితీసింది. రాయితో ఒకరు దాడి చేయడంతో తలకు తీవ్ర గాయమై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు వన్‌టౌన్ సీఐ దేముడుబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం...

వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధి ఫిషింగ్ హార్బర్ జాలారిపేట గాంధీబొమ్మ వద్ద ఈ నెల 4న సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో చెంగలరావుపేటకు చెందిన మత్స్యకారుడు వాసుపల్లి కొండ (30), రైతి ధనరాజు మద్యం సేవించారు. మద్యం మత్తులో వీరి మధ్య డబ్బుల కోసం గొడవ జరిగింది. ధనరాజు రాయితో కొండ ముఖంపై బలంగా కొట్టాడు, తీవ్ర గాయాలకు గురైన కొండ ఒక్కసారిగా కిందపడిపోయాడు. అయితే కిందనున్న మరో రాయిపై పడిపోవడంతో పెద్ద గాయమయింది. తీవ్ర రక్తస్రావంతో రోడ్డుపై పడిఉన్న అతడిని స్థానికులు చికిత్స నిమిత్తం వెంటనే కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి హత్యానేరం కింద కేసు నమోదు చేశారు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం ఇద్దరూ నిత్యం మద్యం తాగేవారు. ఈ క్రమంలో కేవలం వంద రూపాయల కోసం వాదులాడుకున్నారు. కొండను ధనరాజు కొట్టడంతో గాయపడి మృతి చెందాడని పేర్కొన్నారు.

స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి

» వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్

సిరిపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, లేదంటే సెయిల్‌లో విలీనం చేయాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ నాలుగేళ్లుగా విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, సొంత గనుల కేటాయించాలని ఉద్యమం జరుగుతుంటే ప్రధాని మోదీ నిమ్మకునీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారన్నారు. రెండేళ్లలో స్టీల్‌ప్లాంట్ బ్లాక్ ఫర్నేస్‌లను మూసివేసి ఉత్పత్తి తగ్గించే కుట్ర పన్నడమే కాకుండా ఉద్యోగులు, కార్మికులకు జీతాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని ప్రకటనలు చేస్తున్నారన్నారు. కానీ కేంద్రం సొంత గనులు ఇవ్వడం లేదన్నారు. కూటమి నేతలు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే నడిచేవిధంగా కేంద్రాన్ని ఒప్పందించాలని, ఈ మేరకు బుధవారం విశాఖలో ప్రధాని మోదీతో ప్రకటన చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.పైడిరాజు, ఎం.జగ్గునాయుడు, ఎం.వెంకటేశ్వర్లు, సీహెచ్ దేవా, శంకరరావు, ఎస్.గోవిందరాజులు ప్రసంగించారు. సభ్యులు జగన్, అచ్యుతరావు, ఆర్కేఎస్వీ కుమార్, పద్మ, బేగం తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న వామపక్ష పార్టీల నేతలు

ప్రధాని పర్యటనపై మంత్రుల సమీక్ష

విశాఖపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాని పర్యటన విజయవంతం చేయడానికి రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు మంగళవారం సమీక్షలు నిర్వహించారు. మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్ వేర్వేరుగా సభావేదిక ప్రాంగణంలో పర్యటించి ఏర్పాట్లు పరిశీలించారు. అధికారులకు పలు సూచనలిచ్చారు. పార్టీ నేతలు దామచర్ల సత్య, కిలారి రాజేష్, చింతకాయల విజయ్‌ల వద్ద జన సమీకరణపై ఆరా తీశారు.

1.25 లక్షల పులిహోర ప్యాకెట్లు సిద్ధం

విశాఖపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ సభకు హాజరురానున్న ప్రజలకు పంపిణీ చేసేందుకు నగరంలోని పలుచోట్ల ఆహార ప్యాకెట్లు సిద్ధంచేస్తున్నారు. పులిహోర ప్యాకెట్లను మంగళవారం రాత్రి నుంచి బాక్సుల్లో నింపి ఎండీయూ వాహనాల ద్వారా వార్డులకు పంపనున్నారు. నగరంలో 33 పాయింట్లకు పులిహోర ప్యాకెట్లు బుధవారం ఉదయానికి చేరుకునేలా ఆదేశాలిచ్చారు. నగరంతోపాటు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి వచ్చే వారి కోసం 1.25 లక్షల ప్యాకెట్లు సిద్ధం చేశారు. పాయింట్ల వద్ద బస్సులకు వీటిని సరఫరాచేసేందుకు నగరంలోని 600 మంది రేషన్ డీలర్లు, 300 మంది ఎండీయూ వాహనాల ఆపరేటర్ల సేవలను వినియోగించారు.

'ఎండీయూ వాహనాలను నిలిపివేయాలి'

విశాఖపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ రేషన్ పంపిణీ చేస్తున్న వాహనాలు నిలుపుదల చేసి దుకాణాల్లోనే నిత్యావసరాలు పంపిణీ చేయాలని మత్స్యకారుల యువజన సంక్షేమ సంఘం కార్యదర్శి తెడ్డు శంకరరావు పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. వాహనాలు వీధి శివారున ఉంచి సరకులు ఇస్తున్నారని, దీనివల్ల వినియోగదారులకు ఇబ్బందులు తప్పడం లేదని పేర్కొన్నారు.